హైదరాబాద్ వార్త

బాల్య వివాహాలు సామాజిక దురాచారం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: కాలానుగుణంగా మనుషులు మారాల్సిన అవసరం ఉందని, కాలం చెల్లిన దురాచారాలను పాటించాల్సిన అవసరం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం బస్తీ లాల్‌పేట్ డివిజన్, చాచా నెహ్రూ నగర్ బస్తీలో జరిగిన బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్యవివాహం సామాజిక దురాచారం మాత్రమే కాదు, చట్ట ఉల్లంఘన అని తెలిపారు. బాల్యవివాహాలు బాలికల భద్రత, ఆరోగ్యం, విద్య, అభివృద్ధికి తీవ్రమైన ఆటంకమన్నారు. బాల్యవివాహాల నిర్మూలన కోసం సమాజం మొత్తం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. నాగరిక ప్రపంచంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నా కొన్ని ప్రాంతాలలో కొన్ని దురాచారాలను మాత్రం వీడడం లేదన్నారు. ముఖ్యంగా చాలా మంది మారుమూల గ్రామాలలో మాత్రమే బాల్య వివాహాలు జరుగుతున్నాయనుకుంటున్నారని, నగరాలలో కూడా జరుగుతున్నాయని తెలిపారు. బస్తీలలో ఉన్న యువత ఇలాంటివి తెలుసుకున్నపుడు చట్టానికి తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. వివాహ వ్యవస్థపై, జీవన విధానంపై, సమాజంపై ఎలాంటి అవగాహన లేని బాల్యంలో జీవితంలో అత్యంత భారీ ఘట్టమైన వివాహం జరిపించడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. ఇలాంటివి నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రతిజ్ఞ చేశారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

రోగ నిర్ధారణ పరీక్షలు గగనమే..

- గాంధీ, ఉస్మానియా జనరల్ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న రోగులు

హైదరాబాద్, మార్చి 5 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన స్పత్రులైన గాంధీ, ఉస్మానియా లాంటి ఆస్పత్రులలో రోజురోజుకు రోగుల సంఖ్య పెరిగిపోతోంది. ఇందుకు తగ్గట్టుగా మాత్రం సదుపాయాలు మెరుగుపడడం లేదు. గత కొంత కాలంగా ఈ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం వచ్చే రోగులకు వైద్యులు వైద్య సేవలను విస్తరించాలని ప్రయత్నించినప్పటికి అందుకు అవసరమైన మేరకు వైద్య పరికరాలు అందుబాటులో ఉండడం లేదని తెలుస్తోంది. వాతావరణ మార్పులతో వచ్చే రోగాలతో పాటు ఇతర రోగాలకు వైద్యసేవలు అందించగలిగే ఆస్పత్రులైన సికింద్రాబాద్ గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులలో చికిత్సలకు అవసరమైన పరికరాలు అందుబాటులో లేని కారణంగా సకాలంలో వైద్య సేవలను అందించలేక పోతున్నారు. అన్ని విభాగాలకు సరిపడా వైద్యులు లేనప్పటికి ఆస్పత్రిలో ఉన్న వైద్యులతోనే కాలం నెట్టుకువస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలో దాదాపు 11వందల పడకలు ఉండగా రోగుల సంఖ్య మాత్రం రెండువేలకు మించి ఉంటోంది. మరికొన్ని పడకలు అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నప్పటికి సరైన వైద్యులు అందుబాటులో లేని కారణంగా అలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

రోగ నిర్ధారణ పరీక్షలకు తప్పని తిప్పలు...

రోగికి చికిత్సలు చేయాలంటే అంతకంగే ముందుగా వైద్య పరీక్షలు జరిపించడం అవసరం. రోగిని వైద్యులు పరిక్షించిన అనంతరం వారికి సరైన చికిత్స అందించడం కోసం వైద్యులు రోగాలను నిర్ధారించుకోడాని ఎక్స్‌రేలు అంతకంటే ముఖ్యమైన పరీక్షలు జరిపించుకోవాల్సిందిగా సూచిస్తుంటారు. గాంధీ ఆస్పత్రిలో ఎక్స్‌రే యంత్రాలు కూడా సరిపడా లేకపోవడంతో తీసిన ఎక్స్‌రేలను ఫోన్‌లలో ఫోటోలు తీసుకువచ్చి రోగులే వైద్యులకు చూపించి వైద్య సేవలు పొందుతున్నారు. కనీసం సిటీస్కాన్ చేయాలన్నా నాలుగైదు రోజుల సమయం పడుతుందని రోగులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితిలో వచ్చిన రోగికి రోగ నిర్ధారణ పరీక్షలు జరిపించుకోవాలంటే ప్రాణాల మిదికి వచ్చినంత పనవుతుందని రోగులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజుల కిందట ఓ రోగికి అత్యవసరంగా సిటీస్కాన్ చేయాల్సి ఉండగా టెక్నీషియన్ రోజుల తరబడి సమయం తీసుకుంటుండడంతో రోగి బంధువులు ఆందోళనకు దిగారు. అత్యవసర పరిస్థితిలో రోగ నిర్ధారణ పరీక్షలకు రోజుల సమయం తీసుకోవడం పట్ల మండిపడ్డారు. ఈ విషయంలో సూపరింటెండెంట్ కల్పించుకొని అప్పటికప్పుడు సిటీస్కాన్ చేయించడంతో సమస్య పరిష్కారం అయ్యింది. ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతూనే ఉన్నాయి. నిత్యం రెండు వేల మంది రోగులు ఆశ్రహిస్తున్న ఆస్పత్రిలో సరైన వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులకు తిప్పలు తప్పడం లేదు. కొన్నిసార్లు రోగులు కూడా వైద్యులపై మండిపడుతున్నారు. రోగికి సంబంధించిన రిపోర్టులు సకాలంలో రాకపోవడంతో వైద్యులు కూడా చికిత్సలు జరిపే అవకాశం ఉండకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేకపోయినా సమస్యలు ఎదుర్కొంటున్నారు. చివరికి గాంధీ ఆస్పత్రి మార్చూరీలో ఫ్రీజర్‌లు కూడా అన్ని సక్రమంగా పనిచయడం లేదు. వాటిని గాంధీ ఆస్పత్రి ఏర్పాటు చేసినప్పుడు ఉన్నవే తప్ప మళ్ళి కొత్తవి ఏర్పాటు చేయడం లేదని చెబుతున్నారు. దాదాపు 70 ఫ్రీజర్‌లు ఉండగా వాటిలో సగం కంటే ఎక్కువే పని చేయడం లేదని తెలుస్తోంది. ఆస్పత్రి వర్గాలు ప్రభుత్వానికి వీటి విషయమై లేక రాయగా వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఈ విషయమై సూపరింటెండెంట్‌ను ఆరా తీశారు. వెంటనే (టీజీఎంఎస్ఐడీసీ) తెలంగాణ వైద్యవిద్యా మౌళిక సదుపాయాల కల్పన సంస్థ ఫ్రీజర్‌ల మంజూరుకు అనుమతించింది. దీంతో త్వరలోనే దాదాపు 40 ఫ్రీజర్‌లు కొత్తవి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. ఇలా అత్యవసరమైతే తప్ప ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు, మిషనరీ అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

రోగులు ఆస్పత్రికి వస్తున్నారు, పోతున్నారు. కాని ఆస్పత్రిని ఆశ్రహించిన రోగులక సమస్యలు మాత్రం అంతమాత్రంగా పరిష్కారం అవుతున్నాయని రోగులు చెబుతున్నారు.

ఈవేస్ట్‌పై బల్దియా ఫోకస్..

- ఇళ్లు, ఆఫీసుల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ
- వేస్టేజ్ ఇచ్చేవారికి ప్రోత్సాహకంగా కూపన్లు, నగదు
- ప్రతి శని,ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త:

నగరంలో పెరుగుతున్న ఈవేస్ట్ సమస్యపై బల్దియా ప్రత్యేక దృష్టి సారించింది. ఇళ్లలో, ఆఫీసుల్లో పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించేందుకు కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా ఉచితంగా ఈవేస్ట్ సేకరించిన జీహెచ్ఎంసీ ఇక నుంచి ప్రజలకు రిడీమేబుల్ కూపన్లు ఇచ్చి ఈవేస్ట్ తీసుకునే లా చర్యలు తీసుకుంటుంది. నగరంలో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, కంప్యూటర్లు, ఛార్జర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పాడవడంతో ఈవేస్ట్ భారీగా పెరుగుతోంది. అయితే సరైన విధంగా సేకరణ జరగకపోవడంతో ఈ వ్యర్థాలు కాలనీల్లోనే పేరుకుపోతూ పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని జీహెచ్ఎంసీ అధికారులు కొత్త విధానాన్ని తీసుకువచ్చారు. ప్రజలు ఇచ్చే ఈవేస్ట్ కు బదులుగా అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లకు సంబంధించిన రిడీమేబుల్ కూపన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటివరకు ఈవేస్ట్‌ను ఇన్నిరోజుల పాటు బల్దియా అధికారులు ఫ్రీగా ఇంట్ల నుంచి సేకరించారు. స్పెషల్ డ్రైవ్ పెట్టి వార్డు ఆఫీస్‌ల వద్ద కియోస్క్‌లు ఏర్పాటు చేసి సేకరించారు. మున్సిపల్ సిబ్బంది కి ఫ్రీగా ఇవ్వడం ఎందుకు అనుకుంటున్న జనం వారికి ఇవ్వకుండా ఎంతో కొంత వస్తుందని స్క్రాప్ షాప్‌కు అమ్ముకుంటున్నారు. దీంతో స్క్రాప్ షాప్ వారు ఆయా ఈవేస్ట్ లో వారికి అవసరమైన మెటీరియల్ తీసుకొని మిగతాది బయట పడేస్తున్నారు. ఆ మెటీరియల్ అంతా సరిగ్గా రీసైకిల్ అవ్వకపోవడంతో పర్యావరణానికి హాని జరుగుతోంది.

ఈవేస్ట్ ఇస్తే కూపన్లు..

ఇప్పటివరకు నగరంలో ఉచితంగా ఈవేస్ట్ సేకరించిన బల్దియా..ఇకపై ప్రజలకు ప్రోత్సాహకంగా కూపన్లు ఇచ్చి ఈ వ్యర్థాలను ఎక్కువగా సేకరించాలని భావిస్తోంది. ప్రజలు ఇచ్చే ఈవేస్ట్ విలువ ఆధారంగా అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మింత్రా లాంటి ఆన్లైన్ షాపింగ్ వౌచర్లు, కూపన్లు ఇవ్వనున్నారు.. ఆయా కూపన్లు వద్దు అనుకున్నవారికి యూపీఐ ద్వారా డబ్బులు కూడా వేయనున్నారు. ఇక నుండి జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలో ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక ఈవేస్ట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. కాలనీలకు వెళ్లి పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఎవరైనా వచ్చి వార్డు ఆఫీస్ లో తమ వద్ద ఈ వేస్ట్ ఉందని సమాచారం ఇస్తే ఇంటికి వెళ్ళి మరీ సిబ్బంది సేకరిస్తారని చెబుతున్నారు. ఈ వేస్ట్ రీసైక్లింగ్ చేసే సంస్థలతో కూడా జీహెచ్ఎంసీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఫ్రీగా కాకుండా కూపన్లు ఇచ్చి ఈవేస్ట్ సేకరణ చేపట్టాలన్న ప్రతిపాదనకు రీసైక్లింగ్ సంస్థలు కూడా అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో నగరంలో ఈవేస్ట్ సమస్యకు కొంతవరకు పరిష్కారం దొరికే అవకాశముందని చెబుతున్నారు.

8న బమ్మక్‌దౌలా ..9న కూకకట్‌పల్లి నల్లచెర్వు

-సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

-హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్

ఏర్పాట్లు పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త:

పాతబస్తీలో చారిత్రక బమ్మకున్ ఉద్ దౌలా లేక్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల8న ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు సిఎం రేవంత్‌రెడ్డి ఈ చెరువును ప్రారంభించనున్నారు. అలాగే మరుసటిరోజు 9న నల్లచెరువును ప్రారంభించనున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం బమ్మకున్ ఉద్ దౌలా చెరువును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి చెరువు సుందరీకరణ పనులను తిలకించారు. చెరువు కట్టతో పాటు..ఖాళీ ప్రదేశాల్లో నాటిన ఔషధ మొక్కలను పరిశీలించారు. పిల్లలు ఆడుకునే ప్లే ఏరియాలతో పాటు.. అన్ని వయసులవారు సేద దీరేందుకు వీలుగా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన గజబోలు (గుమ్మటాలు)ను చూశారు. పాతబస్తీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, చెరువు చరిత్రను వివరించిన బోర్డులను పరిశీలించారు. చెరువును ప్రారంభించిన తర్వాత జరగనున్న సభ ఏర్పాట్లను కూడా కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట హైడ్రా అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్, అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు.. పోలీసు శాఖ అధికారులు ఉన్నారు

పారిశుధ్య కార్మికుల పని సమయాలలో స్వల్ప మార్పులు

-ఎంఎంసి అదనపు కమిషనర్ రఘుప్రసాద్

హైదరాబాద్,మార్చి 5 ,ప్రభాతవార్త

మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య కార్మికుల పని సమయాలలో స్వల్ప మార్పులు రాబోతున్నాయి. రాబోవు తీవ్ర ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయం ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రతీ సంవత్సరంలాగే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రత ప్రమాణాల మెరుగుదల కోసం పని గంటలలో స్వల్ప మార్పులు చేయాలని మల్కాజిగిరి నగరపాలక సంస్థ కమిషనర్ టి వినయ్ క్రిష్ణారెడ్డి నిర్ణయించారు.

హాజరు నమోదు సమయ వివరాలు...

ఉదయం 5 గంటల నుండి 6 గంటలకు, మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంట వరకు ఇప్పటి వరకు మధ్యాహ్న హాజరు నమోదు మధ్యాహ్నం 1 గంటల నుండి 2 గంటల వరకు ఉండేది. ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రతల నమోదు అవడం, కార్మికులు అనారోగ్యానికి గురికాకుండా ఉండటానికి ఇప్పుడు ఒక గంట ముందుగానే (12 నుండి 1 గంట) హాజరు నమోదు చేస్తారని ఎంఎంసి పారిశుధ్య విభాగం అదనపు కమిషనర్ సి యన్ రఘుప్రసాద్ తెలిపారు.

కాటేదాన్ టింబర్ డిపోలో భారీ అగ్నిప్రమాదం

అత్తాపూర్ మార్చి 5, ప్రభాతవార్త :

ఓ టింబర్ డిపోలో ఒక్కసారిగా మంటలు చేలరేగి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటన గురువారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.... కాటేదాన్‌లోని సుమిత్ టింబర్ డిపోలో చెక్కలకు మంటలు అంటుకుని భారీగా చెలరేగడంతో కార్మికులు అదుపు చేయలేకపోయారు. మంటలు అక్కడే ఉన్న కల్ప దుంగలు, కట్టెలకు వేగంగా వ్యాపించి మంటలు ఎగసిపడటంతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పక్కనే అనుకుని ఉన్న మరో బిడి షైవుడ్ గోడౌన్‌కు కూడా ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ జోన్ ఏసీపీ శ్రీనివాస్ అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెండు ఫైర్ ఇంజన్ల లతో సిబ్బంది గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు కోటి రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కాటేదాన్ ప్రాంతంలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎండిఎంఎ డ్రగ్స్ స్వాధీనం..నిందితుల అరెస్టు

గన్‌ఫౌండ్రి,మార్చి 5ప్రభాతవార్త:

మెథాంఫేటమిన్(ఎం.డి.ఎం.ఎ) డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

నగరంలో మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను సి.సి.ఎస్.అబిడ్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి నిషేధిత నార్కోటిక్ పదార్థమైన మెథాంఫేటమిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సి.సి.ఎస్,అబిడ్స్ పోలీసులు వివరాల ప్రకారం...జీడ్లమెట్ల, వినాయకనగర్ ప్రాంతానికి చెందిన చైల్‌సింగ్ కుమారుడు జోగిసింగ్ (25),రాజస్థాన్‌నాగౌర్ ప్రాంతానికి చెందిన శంకర్‌లాల్‌చౌదరి కుమారుడు చునారామ్‌చౌదరి(27)అష్టల్‌గంజ్‌అశోక్‌బజార్‌లో నివాసం ఉంటున్నాడు.రాజస్థాన్ జలోర్ ప్రాంతానికి చెందిన అమృత్‌పురోహిత్ (32) కూకట్‌పల్లిలో నివాసం ఉంటూ ఆప్టికల్స్‌సప్లై చేసుకుంటూ అక్రమంగా ప్రభుత్వం నిషేధిత నార్కోటిక్ ఎం.డి.ఎం.ఎ పదార్థాన్ని విక్రయిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుసుకుని ప్రత్యేక నిఘాపెట్టారు.బషీర్‌బాగ్ బిజెఆర్ విగ్రహం సమీపంలో ముగ్గురు వ్యక్తులు నిషేధిత నార్కోటిక్ పదార్థాన్ని విక్రయించేందుకుగాను ప్రయత్నిస్తుండగా సి.సి.ఎస్,అబిడ్స్ పోలీసులు దాడులు చేసివారిని అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి 72 గ్రాముల ఎం.డి.ఎం.ఎ డ్రగ్స్ ప్యాకెట్లు,4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.హైదరాబాద్‌లోని అవసరమున్న వినియోగదారులకుఎం.డి.ఎం.ఎ డ్రగ్స్‌ను ఈ సింథటిక్ డ్రగ్స్ సాధరణంగా ఫౌడర్,లేదా, క్రిస్టల్ రూపంలో ఉంటుందన్నారు.మత్తుపదార్థం వినియోగించడం ద్వారా గుండె కొట్టుకునే వేగం పెరగడం,శరీరఉష్ణోగ్రత,అధికమవ్వడం,దవడ కండరాలు బిగుసుపోతా యన్నారు. ప్రమాదకరమైన డ్రగ్స్ అనిపోలీసులు తెలిపారు.గ్రాము 6వేల నుంచి 9వేల రూపాయల వరకు విక్రయిస్తారని పోలీసులవిచారణలో వెల్లడైన్నట్లు చెప్పారు. డిసిపి (డిడి)ఎస్. చైతన్య కుమార్,(స్పెషల్ క్రైమ్ టిమ్)ఎసిపిజి.వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ డి.బిక్షపతి,అబిడ్స్‌పోలీసులు దాడులు చేసివారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఎం.డి.ఎం.ఎ వంటి మాదక ద్రవ్యాల వాడకం,విక్రయం, రవాణా, నిల్వ చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమన్నారు.ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే వారిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంద న్నారు.ప్రజలు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు.

ఉప్పల్ భగాయత్‌ను సందర్శించిన ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

ఉప్పల్, మార్చి 5 ప్రభాతవార్త : ఉప్పల్ భగాయత్ లేఅవుట్ ప్రాంతాన్ని గురువారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి పలువురు అధికారులతో కలిసి సందర్శించారు. భగాయత్‌లో సిఎం రేవంత్ రెడ్డి పర్యటన దృష్ట్యా అధికారులు ముందస్తుగా పలు ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఒకటి రెండు రోజుల్లో సిఎం రేవంత్‌రెడ్డి ఉప్పల్ లోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారని, దీంతోపాటు ఉప్పల్ భగాయత్ ప్రాంతాన్ని కూడా సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉప్పల్ భగాయత్ లేఅవుట్ పరిశీలించి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు, స్థలం సదుపాయం తదితర అంశాలను తెలుసుకున్నారు. ఉదయం ఉప్పల్ సర్కిల్ కార్యాలయం చేరుకుని అక్కడ షాపింగ్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం, పోలీ స్‌స్టేషన్ క్వార్టర్లు పరిశీలించారు. అనంతరం ఉప్పల్ చౌరస్తాలో నిర్మించిన వరద నీటి స్టోరేజీ ట్యాంక్ పనులను పరిశీలించారు. చెత్త డంపింగ్ పాయింట్లు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

త్వరలో ఉప్పల్ భగాయత్‌లో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన :

ఉప్పల్ భగాయత్ స్థల పరిశీలన చేస్తున్న మల్కాజిగిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు

ఉప్పల్ భగాయత్‌లో త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారని అధికా రులు పేర్కొంటున్నారు. భగాయత్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనం నిర్మించేందుకు అనువుగా ఉన్న స్థలాన్ని పరిశీలించనున్నట్లు సమా చారం. కొత్తగా ఏర్పడిన ఎంఎంసి ప్రధాన కార్యాలయం భవనం భగాయత్‌లో నిర్మించేందుకు ప్రణాళికలు రూ పొందించినట్లు సమాచారం. మల్కా జిగిరి కార్పొరేషన్ యొక్క దీర్ఘకాలిక పరిపాలనా అవస రాలకు అనుగుణంగా భూమి లభ్యతను అంచనా పరిశీలించడం, మౌళిక సదుపాయాలను ప్లాన్ చేయడంపై ఈ పర్యటనలో అధికారులు దృష్టి సారించారు.

మహిళా వైద్యులు, సిబ్బందితో తొలి ఆపరేషన్ థియేటర్

- ఏఐఎన్‌యూ ఆసుపత్రిలో ప్రారంభించిన శిఖాగోయల్

జూబ్లీహిల్స్, మార్చి 5, ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని బంజారాహిల్స్‌లోని ఆసియన్ ఇనిస్టిట్యూ ట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్ యూ) ఆసుపత్రిలో మహిళా వైద్య సిబ్బందితో నిర్వహించే ఆల్ ఉమెన్ ఆపరేషన్ థియేటర్(ఓటీ) అయిన సెంటర్ ఫర్ ఫంక్షనల్ అండ్ ఫిమేల్ యూరాలజీ కేంద్రాన్ని ఐపీఎస్ అధికారి, టీజీసీ ఎస్‌బి డైరక్టర్ శిఖాగోయల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి తీసు కున్న నిర్ణయం మహిళల ఆరోగ్య సాధికరత దిశ గా తీసుకొన్న వినూత్న నిర్ణయమని అభినందించారు. మహిళలు తమ ఆనారోగ్య సమస్యల విష యంలో ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని, తద్వారా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. చాలా మంది అనుమానాలతో, సంకుచిత త్వంతో వైద్యుల వద్దకు వెళ్లరని, అలాంటి ఆలోచనలను మానుకోవాలని సూచించారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్య కరంగా ఉంటుందన్నారు. మహిళల్లో మూత్ర అసంయమనం, పెల్విక్ ఆర్గన్ ప్రోలాప్స్, పునరా వృత మూత్ర మార్గ ఇన్ఫెక్షన్లు, మూత్రాశయ నొప్పి వంటి సమస్యలు అధికంగా కనిపిస్తున్నప్పటికీ, సామాజిక సంకోచం, అవగాహన లోపం కారణంగా చాలామంది చికిత్సకు ముందుకు రావడం లేదన్నారు. ఈ సమస్యలకు సమగ్ర నిర్ధార ణ, ఆధునిక చికిత్సలు ఒకే చోట అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి వైద్యు లు వివరించారు. ఈ కేంద్రంలో మూడు ముఖ్య విభాగాలు ఏర్పాటు చేశామని పూర్తిగా మహిళా వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సులు, సాంకేతిక నిపుణులతో పనిచేసే ప్రత్యేక ఆపరేషన్ థియేటర్, శస్త్రచికిత్స అవసరం లేకుండా పెల్విక్ కండరాల బలపరిచే పునరావాస కార్యక్రమం, మూత్రాశయ పనితీరును అంచనా వేసే యూ రోడైనమిక్ పరీక్షల సదుపాయం అందుబాటులో ఉంచామన్నారు. గత ఐదేళ్లలో ఏఐఎన్‌యూ మహిళా యూరాలజీ బృందం 307 ప్రధాన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. మూత్ర లీకేజ్, యూరినరీ ఫిస్టులాలు, సిస్టోసీల్స్, ఫీమేల్ యూరోఫ్లాస్టీ వంటి క్లిష్ట సమస్యలకు చికిత్స అందించిన అనుభవం తోనే ఈ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సారికా పాండ్య మాట్లాడుతూ.. మహిళలు తమ ఆరోగ్య సమస్యలను దాచిపెట్టకుండా ముందుకు రావా ల్సిన అవసరం ఉందని, ఆధునిక సాంకేతికతతో సమ గ్ర చికిత్సలు అందించేందుకు ఈ కేంద్రం తోడ్పడు తుందన్నారు. కన్సల్టెంట్ డాక్టర్ దీప్తి సురేకా మాట్లాడుతూ, మహిళలు సంకోచం లేకుండా వైద్య సేవలు పొందేలా పూర్తి మహిళా సిబ్బం దితో ఈ ఓటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. యువతుల నుంచి వృద్ధుల వరకు మహిళల యూరాలజీ సమస్యలకు రోగికేంద్రీకృత, సమగ్ర వైద్య సేవలు అం దించడం ఈ కేంద్ర లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ యూరాలజీ (ఏఐఎన్‌యూ)లో సెంటర్ ఫర్ ఫంక్షనల్ అండ్ ఫీమేల్ యూరాలజీను ప్రారంభిస్తున్న ఐపీఎస్ అధికారి శిఖా గోయెల్ ,డాక్టర్ సారికా పాండ్య ,డాక్టర్ దీప్తి సురేఖ

వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీగణేష్

వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, మార్చి 5 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ప్రభుత్వ ప్రధాన సలహాదారు(ముఖ్యమంత్రి వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి ఎంపికై నేడు అసెంబ్లీలో నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. నామినేషన్ వేసిన అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వేం నరేందర్ రెడ్డి చేసిన సేవలను, 2018, 2023 ఎన్నికలలో పోటీ చేయకుండా త్యాగం చేసి పార్టీ విజయం కోసం చేసిన కృషిని అధిష్ఠానం గుర్తించి రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు చేసిందని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ సలహాదారుగా ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్ళారని, ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అన్ని ఎన్నికలలో పార్టీ విజయం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు కాంగ్రెస్ అధిష్ఠానానికి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్కి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్నకు బిఆర్ఎస్ నేతల నివాళి

దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్నకు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

కంటోన్మెంట్ మార్చి 5 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సాయన్న జయంతిని పురస్కరించుకొని గురువారం బోయిన్ పల్లిలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్లతో పాటు టిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. రసూల్ పురలో బోయిన్పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిల్వర్ కాంపౌండ్ వద్ద ఉన్న సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పవర్ బోర్‌వెల్స్‌కు మరమ్మతులు

అడ్డగుట్టలో పవర్ బోర్‌వెల్స్ మరమ్మత్తులు చేయిస్తున్న బిజెపి నేతలు హంసరాజ్ తదితరులు

అడ్డగుట్ట,మార్చి 5 ప్రభాతవార్త: అడ్డగుట్ట ఏ సెక్షన్‌లో పవర్‌బోర్‌వెల్ పనిచేయకపోవడంతో స్థానికులు బిజెపి డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య దృష్టికి తెచ్చారు. వెంటనే ఆమె జలమండలి డిజిఎం దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించి ఏఈ శ్రీనివాస్ గురువారం బోర్‌వెల్ మరమ్మత్తులు చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా కన్వీనర్ కళావతి, బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి గంబీరావ్ పేట్ సాయన్న, హంసరాజ్ తదితరులు పాల్గొన్నారు.

31లోగా ఆస్థిపన్ను చెల్లిస్తే 30 శాతం వడ్డీ మాఫీ

కంటోన్మెంట్ బోర్డు

అడ్డగుట్ట,మార్చి 5 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని నివాసులకు ఈ నెల 31లోపు ఆస్థిపన్ను చెల్లించే వారికి 30 శాతం లేదా గరిష్టంగా 10 వేల రూపాయలు వడ్డీ మాఫీ అమలు చేయనున్నట్లు బోర్డు సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేది ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదుపాయం ఈనెల 31లోపు ఆస్థిపన్ను చెల్లించే వారికి వర్తిస్తుందని తెలిపారు. ఆస్థి పన్ను బకాయి దారులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటోన్మెంట్‌లో ఆస్థి పన్ను రూ.40 కోట్లు ఉండగా, బకాయిలు దాదాపు 20 కోట్లు ఉన్నట్లు తెలిపారు.

బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాలి : ఎస్ఐఓ

సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ ఫరాజ్ అహ్మద్

సైఫాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: వచ్చే బడ్జెట్ సమావేశాల్లో విద్య, విద్యార్థి సంక్షేమం, యువజనాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పించాలని, విద్యా రంగంలో ఉన్న లోపాలను సరిదిద్దడానికి నిర్ణయాత్మక విధానాలను రూపొందించాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) కోరింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ గత బడ్జెట్‌లో ప్రభుత్వం విద్య, మైనార్టిల సంక్షేమానికి నిధులు కేటాయించినప్పటికి వాటిలో గణనీయమైన నిధులు ఖర్చు చేయకుండా మిగిలిపోవడం, అమలులో అలస్యం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, ఉన్నత విద్యా సంస్థలకు మద్దతు ఇవ్వడానికి కేటాయించిన నిధులను సకాలంలో పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫీజులు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, విద్య హక్కు చట్టం సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు లభించే 25 శాతం సీట్లను అమలు చేయాలని, డిఎస్సీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ముఖ్యంగా ఉర్దూ మీడియంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు.

అభినందన ఆయుష్‌ను పెంచుతుంది : జస్టిస్ రాధారాణి

అభినందన నలభైవసంతాల వేడుకలను ప్రారంభిస్తున్న జస్టిస్ జి.రాధారాణి, కవిత, తనికెళ్ళభరణి, ఓలేటి, ఇ.భవాని తదితర అతిథులు

రవీంద్రభారతి, మార్చి 5 ప్రభాతవార్త : ఇంట్లో ఒక వంటచేస్తే, ఒక చీర కట్టుకుంటే అది బాగుందని చెపితే లేక చెప్పరేనని అడిగిమరీ అభినందనతో సంతోషిస్తామని, ప్రతీ మనిషికి మరొకరు భుజంతట్టి చెప్పే అభినందన అనేది ఆక్సిజన్ వంటిదని, ఆ ఉత్సాహం ఆయుష్‌ను పెంచుతుందని జస్టిస్ జి.రాధారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో అభినందన సంస్థ నలభైయేళ్ల పండుగ సంస్థ మహిళల ఆటపాట నృత్యాలతో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, సంస్థను, వ్యవస్థాపకురాలు ఇ.భవానీలకు శుభాభినందనలు తెలిపారు. స్త్రీలు ఏ కార్యక్రమం నిర్వహించినా ఓ పండుగలా ఉంటుందన్నారు. ఈ సందర్భంలో స్త్రీ ఒక దేశాధినేత అయితే ఈకాలంలో యుద్ధాలవంటి ఉపద్రవాలు జరుగవని, ఇప్పుడు జరుగుతున్న యుద్ధాల వాతావరణం భయానకంగా కనిపిస్తుందని, ఇరాన్‌లోని ఒక బాలికల పాఠశాల మీద బాంబులువేస్తే 165మంది బాలికలు చనిపోవడం మనస్సును కలిచివేసిందన్నారు. స్త్రీ అధినేతలుంటే ఇలాంటి పనులు చేయరు, ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో అభినందన సాంస్కృతిక సాంఘిక సేవాసంస్థ నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణ అభినందనలతో ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన అంగరంగ వైభవంగా జరిగిన అభినందన 40 వసంతాల పండుగకు ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ జి.రాధారాణి, విశిష్ట అతిథులు తనికెళ్ల భరణి, ప్రముఖనటి కవిత, గౌరవ అతిథులు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డా. ఇ.భవాని, సురేఖామూర్తి తదితరులతో కలిసి జ్యోతిప్రకాశనంచేసి మాట్లాడారు. సభకు అభినందన ఇ.భవాని స్వాగతం పలికారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా డా. శోభారాజు, డా. అనంతలక్ష్మి, డా. కె.వి. కృష్ణకుమారి, శిరోమణి వంశీరామరాజు, తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్‌లకు ఘనంగా ఆత్మీయసత్కారం కావించారు. సభకుముందు జరిగిన సినీ గానలహరి, నృత్యప్రదర్శన, మూడే నాటిక, అభినందన సంస్థ సభ్యుల చే మానవజాతి మనుగడకే నృత్యం, మగువా మగువా నృత్యప్రదర్శనలు ఆహుతులను మంత్రముగ్ధులను కావించాయి.

కాన్సుల్ కార్యాలయంలో ఇరాన్‌కు మద్దతుగా సంతకాలు

బంజారాహిల్స్ లోని ఇరాన్ కాన్సుల్ కార్యాలయం

జూబ్లీహిల్స్, మార్చి 5, ప్రభాతవార్త: నగరంలో నివసిస్తున్న పలువురు ఇరానీయులు గురువారం బంజారాహిల్స్‌లోని ఇరాన్ కాన్సుల్ కార్యాలయానికి వచ్చారు. కాన్సుల్ కార్యాలయంలో ఉన్న పుస్తకంలో వారు ఇరాన్‌కు మద్దతుగా తమ సందేశాన్ని రాసిపెట్టారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇరానీయులు ఒక్కొక్కరిగా వచ్చి తమ మద్దతును తెలియజేశారు. కాన్సుల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పుస్తకంలో తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతూ సంతకాలు చేశారు. మరోవైపు యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇరాన్ కాన్సుల్ కార్యాలయం వద్ద పోలీసులు సైతం ప్రత్యేక నిఘా పెట్టారు. మరోవైపు బంజారాహిల్స్ రోడ్ నంబరు 7లో ఇమామ్ ఖోమిని రోడ్ సైతం ఉంది.

రాష్ట్రవ్యాప్త ప్రముఖులకు సారస్వత పరిషత్తు ధర్మనిధి పురస్కారాలు

: పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య

నాంపల్లి, మార్చి 5 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 8 మంది ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు ధర్మనిధి పురస్కారాలు అందజేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య తెలిపారు. పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన ఈ నెల 17న సాయంత్రం 5.30లకు బొగ్గులకుంట సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో జరిగే సభలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ పురస్కారాలు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. పరిషత్తు ధర్మనిధి పురస్కారాలకు ఎంపికైన వారిలో గోపదాని రవీందర్‌కు డా. తిరుమల శ్రీనివాసాచార్య పురస్కారం; శైలజామిత్రకు తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కారం; తుమ్మల వేదరావుకు డా. బిఎన్.శాస్త్రి పురస్కారం; డా. చీదెళ్ళ సీతాలక్ష్మికి ఆచార్య మడుపు కులశేఖరరావు పురస్కారం; కాసర్ల నరేష్‌రావుకు నారపరాజు రాఘవసీత పురస్కారం, పెద్దిరెడ్డి గణేష్‌కు బూర్గుల రంగనాథరావు పురస్కారం, బండారు విజయకు డా. కె.అంజిరెడ్డి పురస్కారం, వేదార్థం మధుసూదనశర్మకు తిరుకోవల్ శ్రీలక్ష్మి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు డా. జె.చెన్నయ్య వెల్లడించారు. ధర్మనిధి పురస్కారం కింద ఒక్కొక్కరికి 5వేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళ మెడలో బంగారు ఆభరణాలు చోరీ

-12 గంటల్లోగా నిందితులను పట్టుకున్న పోలీసులు

మల్కాజిగిరి మార్చి 5,ప్రభాతవార్త : ఇంట్లో పని పనిచేయడానికి పనిఇవ్వండి, ఇక్కడే ఉండి పని చేసుకుంటా అంటూ ఇంట్లోకి వచ్చి ఒంటరిగా ఉన్న మహిళ మెడలో ఉన్న బంగారు ఆభరణాలను సంఘటన మల్కాజి గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది . ఇన్స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం మోలాలి హనుమాన్ నగర్ లో నివాసం మండే లక్ష్మీకాంతం 65 , ఇంట్లోకి ఒక మగ మనిషి ఆడ మనిషి మరొక చిన్న పాపతో వచ్చి మీ ఇంట్లో పని చేయడానికి పని ఇవ్వండి ఇక్కడే ఉండి పని చేసుకుంటామని చెప్పి చిన్న పాపకు కనీసం తాగడానికి మంచినీళ్లు ఇవ్వాలి ఇంట్లోకి వెళ్లి మంచినీరు తెచ్చేలోపే వెనకనుండి మగ మనిషి మహిళ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసులు తెంపుకొని వెళ్లారు, ఒంటరిగా ఉన్న మహిళ తీవ్ర భ్రాంతులకు గురై నోటిమాట రాకపోవ డంతో ఆందోళన వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించా రు. సిసి ఫుటేజ్ ఆధారంగా సాంకేతిక ఆధారాలతో నిందితు లను గుర్తించి రామ్ నగర్ లోని వారి ఇంటి వద్ద అదుపు లోకి తీసుకొని విచారణ చేశారు. ఇక పరిస్థితి బాగాలేక నేరం చేసిన ట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు వద్ద నుంచి తులం నారా బంగారు ఆభరణాలను ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చే సుకుని రిమాండ్ కు తరలించారు. పోలీసుల విచారణలో ఆర్థిక పరిస్థితి బాగాలేక ఆర్థిక ఆర్థిక ఇబ్బందుల వల్ల నేరం చేసినట్లు ఒప్పుకోవడం జరిగిందని పోలీసులు తెలిపారు. సంఘటన జరి గిన 12 గంటల్లోనే డి ఐ. శ్రీశైలం , ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలోనిందితులను పట్టుకొని బంగారు ఆభరణాలను ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మల్కారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ పోటీలు

ఉప్పల్, మార్చి 5 ప్రభాతవార్త : ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్‌లో గురువారం జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీల సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం కోఆర్డినేటర్ డా.వెంకటేశ్వర్లు, జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు బి.హర్షవర్ధన్, కళాశాల డైరెక్టర్ రెవ.బ్రదర్ జాన్ కలరికల్, ప్రిన్సిపల్ డా.పి.జయంతిరెడ్డి, డా.ఎం. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జ్యూరీ సభ్యులుగా ప్రొ.కృష్ణకుమార్, డా.సి.మల్లేష్, డా.జి.అంజనేయులు, ఇసయ్య, పాల్గొని విద్యార్థుల ప్రసంగాలను మూల్యాంకనం చేశారు.ఉత్తమ ప్రతిభ కనబర్చిన సుమారు ఐదు మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివేకానంద డిగ్రీ కళాశాలలో 12న జాబ్ మేళా

చిక్కడపల్లి మార్చి 5 (ప్రభాతవార్త) : విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12వ తేదీన భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రధానా చార్యులు డా. కె.ప్రభు, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా. బి. శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ మరియు నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. బీపీఓ , ఫైనాన్స్, బ్యాంకింగ్, సేల్స్ అసోసియేట్, బిజినెస్ డెవలప్‌మెంట్ వాటిలో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ఇంటర్న్ విజన్ టెక్నాలజీ, యాంట్రిక్స్ అకాడమీ, హెచ్‌ఆర్‌హెచ్ నెక్స్ట్, శ్రీరామ్ చిట్స్, ఐకేఎఫ్ హోం ఫైనాన్స్, వెడ్ లెన్సీ, కార్విన్ గ్లోబల్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, కాలిబర్ తదితర ప్రముఖ కంపెనీలు ఉన్నాయని, 18 ఏళ్లు నిండిన ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులు మరియు ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువు తున్న విద్యార్థులు కూడా అర్హులు అని, అభ్యర్థులు తమ వెంట బయో డేటా , ఆధార్ కార్డు, విద్యా అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ సెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలి. ఎన్ని కంపెనీలకు ఇంటర్వ్యూ ఇవ్వాలనుకుంటే అన్ని సెట్ల పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా పోచమ్మ దేవాలయం వార్షికోత్సవం

అత్తాపూర్ మార్చి 5, ప్రభాతవార్త : అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని పద్మశాలి పురంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయ 8వ వార్షికోత్సవం గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. లోక కల్యాణార్థం అర్చకుల ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ వేడుకలకు మాజీ కార్పొరేటర్ టి. ప్రేమ్ దాస్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోచమ్మ అమ్మవారి కృపతో ఈ ప్రాంత ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరారు . ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించడం అభినందనీ యంమన్నరు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ అన్న వితరణ గావించారు. భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని వడ్డించి నిర్వాహకులు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కాశీగారి యాదగిరి, యంజాల మహేష్, ఏర్వ సత్యనారాయణ, రుద్రాల మహేష్, బొల్ల వెంకటేష్, బొల్ల లక్ష్మినారాయణ, సారంగా రవి, సంగ్గిశెట్టి రవి, బసప్ప, ఏలాప్ప, కొంపల్లి జగదీష్, దొంత రాజు, కోట శ్యాం, సామల యాదయ్య, సోమయ్య, గోంత్యాల శ్రీనివాస్ తదితరులతో పాటు శివ మార్కండేయ భజన మండలి సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్, ఎఎంసి చైర్మన్‌లకు సన్మానం

శంకర్‌పల్లి, మార్చి 5, ప్రభాతవార్త : శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్‌లను సీనియర్ న్యాయవాది, హైదరాబాదులోని వివి హాస్టల్ సెక్రెటరీ గుండ గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ మాట్లాడుతూ 3వ వార్డులో విజయం సాధించిన తన సోదరుడి వెనుక స్నేహితులు సన్నిహితులు ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. ముఖ్యంగా ప్రవీణ్ కుమార్ గోపాల్ రెడ్డి అత్యంత దగ్గరగా ఉండి పలు సూచనలు చేస్తూ బాధ్యతను భుజాల మీద ఎత్తుకొని ఉధృతంగా ప్రచారం చేశారన్నారు. పార్టీ టికెట్ ఇప్పించటంలో ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.లక్ష వేలు విరాళం

చేవెళ్ల, మార్చి 5, ప్రభాతవార్త : చేవెళ్ల మండలంలోని నాంచెరి గ్రామంలో ఉన్న మల్లన్న, బీరప్ప గుడి అభివృద్ధి కోసం డాక్టర్ వైభవ్ రెడ్డి భారీ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అశోక్‌కు రూ.50,000లను విరాళంగా అందజేశారు. అదేవిధంగా కొత్తపల్లి గ్రామంలోని ఈదమ్మ గుడి అభివృద్ధికోసం మరో రూ. 50,000లను విరాళంగా బీజేపీ నాయకులు ప్రకాశ్ గౌడ్‌కి అందించి తన సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, వైభవ్ రెడ్డిని అభినందించారు.

కుమ్మెర పసికందు హత్య ఘటనపై నిర్లక్ష్యం చేస్తున్న వారిని అరెస్టు చేయాలి

సచివాలయం ఎదుట ఆందోళన కారులను అరెస్టు చేసున్న పోలీసులు

సైఫాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసికందు హత్య ఘటనపై దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అనేక మంది రజకులు గురువారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట, సచివాలయం ఎదుట, లిబర్టి చౌరస్తాలో ఆందోళనలు చేపట్టారు. రజక వృత్తిదారుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో రజకులు ప్లకార్డులు చేబూని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డు మీద బైఠాయించి ఆందోళన చేపట్టడానికి ప్రయత్నించగా పోలీసులు బలవంతంగా అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.అశయ్య మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ కేసు విచారణలో నిర్లక్ష్యం వహించి, కేసును తప్పుదారి పట్టిస్తున్న డిఎస్పీ, సిఐ, ఎస్ఐ, గ్రామ సర్పంచ్, పెత్తందార్లలను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాని న్ని కోరారు. అరెస్టు సందర్భంగా పోలీసులకు, సంఘం నాయకుల మధ్య తోపులాట, వాగ్వివాదం జరిగింది. దీంతో తీవ్రమైన ఉద్రిక్తత ఏర్పడింది. అలాగే రజకులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీరాంనాయక్, కె.ఎస్.అశాలత, స్కైలాబ్‌బాబు తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద పాపం ఎవరిది ? : బిక్షపతి యాదవ్

అనుకోని అగ్నిప్రమాదంతో రోడ్డున పడ్డ కుటుంబాలు..

అగ్నికి ఆహుతి అయిన ఫర్నిచర్ షాపులు

నిజాంపేట్, మార్చి 5, ప్రభాతవార్త నిజాంపేట సర్కిల్‌లోని ప్రగతి నగర్ కమాన్ దగ్గర బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదానికి కారణం ఎవరని డబ్బులకు కమిషన్లకు కక్కుర్తి పడి ప్రమాణాలు పాటించకుండా కమర్షియల్ షాపులకు పర్మిషన్ ఇచ్చిన అధికారులదా లేదా అధికారం ఉంది కదా అంతా మేము చూసుకుంటామని చెప్పి డబ్బులు దండుకుంటున్న ప్రజా ప్రతినిధులదా? అని బిజెపి నాయకుడు బిక్షపతి యాదవ్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనే నిజాంపేటలోని పెట్రోల్ బంక్ పక్కన ఒక కమర్షియల్ షాపులో ఘోర అగ్ని ప్రమాదం జరిగిన దాని నుండి ఎలాంటి గుణపాఠం నేర్చుకొని ఇక్కడి అధికారులు ప్రభుత్వ స్థలాలలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించుకొని కమర్షియల్ షాపులు వెలుస్తున్నప్పటికీ వాటిని నియంత్రించవలసిన అధికారులు ప్రజాప్రతినిధులు కమిషన్లకు కక్కుర్తి పడుతూ నిద్రమత్తులో వేడుక చూస్తున్నారన్నారు. పాపం తమ జీవనోపాధి నిమిత్తం వేరే ఇతర ప్రాంతాల నుండి నిజాంపేట సర్కిల్ ప్రాంతంలోకి వచ్చి ఇతరులకు డబ్బులు చెల్లించి నేను ఆ పార్టీ వాడను నేను ఈ పార్టీ వాడిని అంటూ వస్తున్న వాడికి మామూళ్లు చెల్లిస్తూ పెట్టుకున్న షాపులు ఈరోజు అగ్నికి ఆహుతి కావడం ద్వారా దాదాపు 25 నుండి 30 ఫ్యామిలీలు వారి కుటుంబ సభ్యులు రోడ్డును పడ్డ పరిస్థితి. అలాగే వారు ఎండనక వాననక పిల్లల చదువుల కోసం కష్టపడి పనిచేస్తే ఇప్పుడు ఆ పిల్లల సర్టిఫికెట్లు కూడా మంటల్లో కాలిపోవడం ద్వారా పిల్లల భవిష్యత్తు కూడా అగమ్యగోచరంగా ఉందని కుటుంబ సభ్యులు రోధిస్తున్నారని అన్నారు. దీనికంతటికి కారణం ఎప్పుడైనా విద్యుత్ తీగల కింద ప్రమాదం ఉందని తెలిసి కూడా కాసులకు కక్కుర్తి పడి పర్మిషన్లు ఇచ్చినటువంటి అధికారులు వెనకాల ఉండి కమిషన్ల దండుకుంటున్నా కొంతమంది ప్రజాప్రతినిధులు బాధ్యత వహించి ఆ కుటుంబ సభ్యులందరికీ సరియైన న్యాయం వెంటనే జరిగేటట్టు చేసి ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని భారతీయ జనతా పార్టీ తరఫున బిక్షపతి యాదవ్ డిమాండ్

నల్లచెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన సిఎంసి కమిషనర్ సృజన

నల్లచెరువు వద్ద ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న సిఎంసి కమిషనర్ సృజన

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త: కూకట్‌పల్లి సర్కిల్‌లోని నల్లచెరువు ప్రాంతంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనుల పురోగతిని సిఎంసీ కమిషనర్ జి సృజన గురువారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే చెరువు పరిసరాల అభివృద్ధి, శుభ్రత, మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

విజయవంతంగా వృద్ధురాలికి క్లిష్టమైన వెన్నెముక శస్త్రచికిత్స

కంటోన్మెంట్, మార్చి 5 ప్రభాతవార్త: వృద్ధాప్యంలో వెన్నెముక సమస్యల వల్ల నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలికి వైద్య బృందం క్లిష్టమైన శస్త్రచికిత్సను మెడికవర్ ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించి, ఆమెకు మళ్లీ నడకను ప్రసాదించారు. సుజాత (84) గత పదేళ్లుగా తీవ్రమైన నడుము నొప్పితో బాధపడుతున్నారు. మంచం మీద అటు ఇటు తిరగలేని, కూర్చోలేని స్థితిలో ఉండగా వైద్య పరీక్షల్లో స్పైనల్ కెనాల్ స్టెనోసిస్, వెన్నెముక క్షీణత ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆమెకు మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్య లాంటి ఇతర ఆరోగ్య సమస్యలు ఉండటం శస్త్రచికిత్సను మరింత క్లిష్టతరం చేసింది. సీనియర్ స్పైన్ సర్జన్ డాక్టర్ రమేష్ శీఘాకొల్లి నేతృత్వంలోని స్పైన్ సర్జన్లు, అనస్థీషియా నిపుణులు, కార్డియాలజిస్టులు, క్రిటికల్ కేర్ వైద్యుల బృందం సమగ్రంగా పరిశీలించి లంబార్ డికంప్రెషన్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.ఈ శస్త్రచికిత్సలో డా. శ్రీనివాస్ సలాడి, డా. ప్రదీప్ (న్యూరో అనస్థీషియా) మరియు మెడికల్ సూపరింటెండెంట్ డా. ప్రశాంత్ పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

-కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కార్తీక్ రెడ్డి

అత్తాపూర్ మార్చి 5, ప్రభాతవార్త : రాష్ట్ర అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం శంషాబాద్ డివిజన్ నాయకుడు రాచమల్ల జయసింహ ఆధ్వర్యంలో చిన్నగోల్కొండ గ్రామానికి చెందిన నాయకులు పట్లోళ్ల కార్తిక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.చిన్నగోల్కొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపిటిసి, పాక్స్ మాజీ డైరెక్టర్ రామగళ్ల జంగయ్య, అనుచరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీ ఇంచార్జి కార్తిక్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీని గ్రామాలలో కలిసికట్టుగా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో రామగళ్ల జంగయ్య, సారా బాలరాజ్ గౌడ్, రామగాళ్ల చరణ్ తేజ, ఉస్మాన్, ప్రభాకర్, నగేష్, మొహమ్మద్, షేకర్, సురేష్ మరియు ఇతర నాయకులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మంచర్ల మోహన్ ,సీనియర్ నాయకులు కొనమొల్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, చిన్నగండు రాజేందర్, మంచర్ల శ్రీనివాస్, కొలను ప్రదీప్ రెడ్డి, సయ్యద్ గౌస్, చిలకమర్రి పరందాములు, పవిత్ర సాగర్, రమేష్ రాథోడ్, వెంకట్ రెడ్డి, గుంటి చరణ్, కుమ్మరి అర్జున్, కుమ్మరి గిరి, హనుమంతు ముదిరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

రాజ్యసభ స్థానాల్లో బిసిలకు ప్రాధాన్యత ఇవ్వాలి : రామచందర్‌యాదవ్

శేరిలింగంపల్లి,,మార్చి 5 ప్రభాతవార్త : రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు రెండు సీట్లు కేటాయించాలని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలను బీసీలకే కేటాయించాలని ఆయన కోరారు. దేశంలో 56శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో కనీసం 15శాతం సీట్లు కూడా దక్కటం లేదని వాపోయారు. బీసీలకు నాయకత్వం కల్పించాలని సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లిఖర్జున ఖర్గేలతో సీయం రేవంత్‌రెడ్డి .పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ చొరవ తీసుకుని చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రాజ్యసభలో బీసీలకు సీట్లు కేటాయించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఏఐసీసీ ప్రకటించబోతున్న రాజ్యసభ అభ్యర్థుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఇద్దరు సమర్థవంతమైన బీసీ నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపిక చేసి సామాజిక న్యాయం చేయాలని అన్నారు. బీసీలకు రెండు రాజ్యసభ స్థానాలను కేటాయించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలపై తమ వైఖరిని ఘనసీయంగా చాటుకోవాలని ఆయన కోరారు.

ఫేస్‌బుక్‌లో పరిచయం.. ఇన్‌స్టాలో ప్రేమసందేశం

- పెళ్లి పేరుతో మోసం చేశాడంటూ యువతి ఫిర్యాదు

జూబ్లీహిల్స్, మార్చి 5, ప్రభాతవార్త: ఫేస్‌బుక్‌లో పరిచయమై ఇన్‌స్టాలో ప్రేమిస్తున్నానంటూ ప్రేమ సందేశం పంపి పెళ్లి పేరుతో మోసానికి పాల్పడిన యువకుడిపై ఒక యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని ఒక ప్రాంతంలో బొటిక్ నిర్వహించే యువతికి ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట ప్రాంతానికి చెంది హైటెక్ సిటీ ప్రాంతంలో నివసించే మంత్రాంగం సంతోష్‌తో 2016లో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. 2018లో ఇన్‌స్టాగ్రామ్‌లో యువతిని ప్రేమిస్తున్నానంటూ సంతోష్ ప్రేమ సందేశాన్ని పంపాడు. తొలుత యువతి అతని ప్రేమను నిరాకరించినా తరువాత కొద్ది రోజులకు అంగీకరించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో ఇద్దరి మధ్య ఏకాంత సమయంలో వ్యక్తిగత ఫొటోలు, వీడియో కాల్స్ కొనసాగాయి. వీరిద్దరు తొలుత చెన్నైలో, బెంగళూరులో ఉండి చివరికి హైదరాబాద్‌కు వచ్చారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో వ్యక్తిగతంగా మరింత దగ్గరైంది. ఆమె తన కుటుంబ సభ్యులను పరిచయం చేయగా వారిని కులం పేరుతో దూషించడమే కాకుండా ఆమెను దూరం పెట్టాడు. ఆరా తీస్తే మరో యువతితో పెళ్లి నిశ్చయించుకున్నట్లు యువతి గుర్తించింది. దీనికితోడు ఆమెను బెదిరించడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైలు నుంచి వచ్చాడు.. మళ్లీ చోరీ చేసి చిక్కాడు

- వాహనాల దొంగతనం కేసులో పాత నిందితుడు అరెస్ట్

జూబ్లీహిల్స్, మార్చి 5, ప్రభాతవార్త: వాహన దొంగతనాల కేసులో అరెస్ట్ అయ్యి జైలు నుంచి విడుదలైన రోజు మరో చోరికి పాల్పడి జూబ్లీహిల్స్ పోలీసులకు చిక్కాడు ఒక పాత నేరస్థుడు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో అడ్డదారులు ఎంచుకున్న యువకుడు చివరికి పోలీసుల కటకటాల వెనుకకు చేరాడు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి, భారీగా మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు గత కొంతకాలంగా డ్రగ్స్ వ్యాపారంలో పాల్గొంటున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు చెందిన కరణం పవన్‌సాయి అలియాస్ పవన్ పదో తరగతి చదువు మధ్యలోనే ఆపేసి దుర్వ్యసనాలకు బానిసగా మారాడు. తన అవసరాలకు సరిపడా డబ్బుల కోసం చోరి బాట పట్టాడు. నిందితుడు గత రెండేళ్లలో దాదాపు 11 వాహన దొంగతనాల కేసులో నిందితుడిగా ఉండటమే కాకుండా అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్లాడు. ఫిబ్రవరి 28న జైలు నుంచి బయటకు వచ్చిన పవన్ సాయి తన అవసరాల కోసం మళ్లీ చోరి చేశాడు. ఇందులో భాగంగానే అదే రోజు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లోని ఒక బొటిక్ వద్ద నిలిపిన బైకును చోరీ చేశాడు. దానిపై జల్సాగా తిరుగుతున్నాడు. జూబ్లీహిల్స్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో భాగంగా అనుమానస్పద స్థితిలో తారసపడిన పవన్‌సాయి వద్ద వాహనపత్రాలు లేకపోవడంతో అనుమానించి అదుపులోకి తీసుకొన్నారు. అతన్ని విచారించగా బైకు చోరికి పాల్పడినట్లు అంగీకరించాడు. కాగా జైల నుంచి విడుదలై అదే రోజు చోరికి పాల్పడటమే కాకుండా అయిదు రోజుల్లోనే మరోసారి జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జల్సాలకు అలవాటు పడి నిందితుడు తప్పుదారి పట్టాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

సింగర్స్‌కి బహుమతుల్ని అందజేసిన సినీ గేయ రచయిత చంద్రబోస్

పాటల పోటీలో గెలుపొందిన సింగర్ కు బహుమతి అందజేస్తున్న ఆస్కార్ విన్నర్ చంద్రబోస్, బి.వెంకటేశ్వర్లు, ప్రవీణ్ కొప్పుల, సబిత మట్ల

కూకట్‌పల్లి, మార్చి 5, ప్రభాతవార్త : కూకట్‌పల్లిలోని ప్రేకాస స్టూడియోలో నిర్వహించిన పాటల పోటీల్లో గెలుపొందిన గాయకులకు ఆస్కార్ విన్నర్ సినీ గేయ రచయిత చంద్రబోస్, సింగర్ కొప్పోలు ప్రవీణ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ నేటి తరం యువత తెలుగు పాటలోని కమ్మదనాన్ని తమ గళంతో శ్రావ్యంగా ఆలపిస్తున్నారని అన్నారు. పాటల పోటీలో విజేతలు ముందుందు మరిన్ని మంచి పాటలు పాడి శ్రోతల మన్ననల్ని అందుకోవాలని ఆకాంక్షించారు. పాటల పోటీలను నిర్వహించిన ప్రేకాస స్టూడియో నిర్వాహకులు కాశీ జొన్నవిత్తుల, సబిత మట్ల, ప్రేమ్ సాగర్ ఇర్లాలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. పోటీలు తమలో ఉన్న నైపుణ్యాన్ని మరింత పెంపొందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడియ సెల్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లును సన్మానించారు. ఇక్కడ స్టూడియోలో ఏర్పాటుచేసి గాయనీగాయకులకు అందుబాటులోకి తీసుకువచ్చారని చంద్రబోస్ తెలిపారు. ప్రేకాస నిర్వాహకులు నిర్వహించిన ప్రేకాస ఐకాన్ సింగింగ్ కాంపిటీషన్ సీజన్ వన్‌కి జడ్జిగా ప్రవీణ్ కుమార్ కొప్పుల వ్యవహరించారు. ఫైనల్ రోజున ముఖ్య అతిథిగా ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేకాస నిర్వాహకులు సబిత మట్ల, ప్రేమ్ సాగర్ లు పాల్గొన్నారు.

2026 పరాభవ నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి మార్చి 5 (ప్రభాతవార్త) : ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్త, కల్యాణానంద పీఠం అధిపతి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త , బ్రహ్మశ్రీ డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయ శర్మ రూపొందించిన 2026 శ్రీ పరాభవఖి నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. భక్తి, ఆధ్యాత్మికత ఖచ్చితమైన తిథి, నక్షత్ర గణితంతో కూడిన ఈ క్యాలెండర్ సామాన్య భక్తులకు, పండితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దృక్ సిద్ధాంతం ప్రకారం పండుగలు, పర్వదినాలు మరియు గ్రహణాల వివరాలను క్షుణ్ణంగా పొందుపరిచారు. కల్యాణానంద పీఠం ఆధ్వర్యంలో ప్రతి ఏటా లోక కళ్యాణం కోసం జ్యోతిష్య మార్గదర్శకాలను హనుమంతరాయ శర్మ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు, పీఠం ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని హనుమంతరాయ శర్మ గారి కృషిని కొనియాడారు. ఈ క్యాలెండర్ త్వరలోనే అన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాల్లో అందుబాటులోకి రానుంది.

క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరం

..డాక్టర్ యు.ఆజాద్ చంద్రశేఖర్

చిక్కడపల్లి మార్చి 5 ప్రభాతవార్త : క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన చాలా అవసరమని ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డా. యు. ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం విద్యానగర్ లోని హాస్పిటల్ ఆధ్వర్యంలో కాన్సర్ పై అవగహన కార్యక్రమంలో భాగంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన 36 ఏళ్ల సంసున్ నహర్ బీబీ అనే మహిళ కుడి ఛాతీలో ఏర్పడిన భారీ కణితిని సురక్షితంగా తొలగించి ఆమెకు కొత్త జీవితం అందించారు. అత్యాధునిక సాంకేతికత, నైపుణ్య వైద్య బృందం, అంతర్జాతీయ ప్రమాణాల చికిత్సా విధానాలతో సంక్లిష్ట క్యాన్సర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రవి కుమార్ రెడ్డి, డా.విశాల్ డాక్టర్ రాకేష్ కుమార్ డాక్టర్ ఉల్లాస్, డాక్టర్ దిలీప్, డాక్టర్ హబీబ్, డాక్టర్ కిషోర్, డాక్టర్ సమంత్, డాక్టర్ రాకేష్, డాక్టర్ గౌతమి, రవీంద్ర నాథ్ గరగ, సి ఓ ఓ డా.మధుసూదన్ రావు, మెడికల్ సూపరింటెండెంట్, శ్రీవల్లి, సెంటర్ హెడ్ లతో పాటు పలువురు వైద్యులు, వైద్యేతర సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నేడు శిల్పకళావేదికలో సిఎంకు సన్మాన సభ

-మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేటషన్ కమిటీ

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త: మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సన్మానసభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం హైటెక్ సిటీ శిల్పకళావేదికలో మధ్యాహ్నం 12గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపా రు. ఎస్సీ రిజర్వేషన్‌వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సీఎం రే వంత్‌రెడ్డికి జరిగే ఈ సన్మానసభకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మాదిగ ఎంప్లాయిస్ పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

నూతన ఎంఇఓ నిరంజన్‌కు శుభాకాంక్షల వెల్లువ

గండిపేట మండల నూతన ఎంఇఓ నిరంజన్‌ను సన్మానిస్తున్న నాయకుల దృశ్యం

నార్సింగి, మార్చి 5 ప్రభాతవార్త : మణికొండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ గండిపేట మండల ఎంఇఓగా పదోన్నతి పొందారు. గురువారం ఆయన పదవీ బాధ్యతను చేపట్టారు. ఈ సందర్భంగా నిరంజన్‌ను మణికొండ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి తదితరులు ఎంఇఓకు పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో కార్పోరేట్ స్థాయిలో విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న నిరంజన్‌కు ఎంఇఓ పదవి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేద విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా మారుస్తున్నారని వివరించారు. ఇన్నాళ్లు మణికొండ పాఠశాలలో కార్పోరేట్ స్థాయి విద్యను విద్యార్థులకు అందించారని,అలాగే ఇప్పుడు గండిపేట మండలం మొత్తం పాఠశాలలో కార్పోరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తారని నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యయ వృత్తి చాలా పవిత్రమైందని, భావి భారత పౌరులను తయారు చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని, దాన్ని నూతన ఎంఇఓ నిరంజన్ చలా చక్కగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులందరికి నిరంజన్ కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరి సహకారం తీసుకొని గండిపేట మండలంలోని ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యాబోధనను విద్యార్థులకు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వవరించారు. గత ఏడాదికంటే అధికంగా పదో తరగతిలో ఉత్తీర్ణత శాతంను తీసుకు వచ్చేందుకు ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు చదువులు చెప్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దప్ప, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు క్రీడలు దోహదం : డిసిపి రక్షిత మూర్తి

సికింద్రాబాద్ జోన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షిత మూర్తి

చిక్కడపల్లి మార్చి 5 (ప్రభాతవార్త) : పోలీసుల విధి నిర్వహణలో మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షిత మూర్తి అన్నారు. గురువారం బాగ్ లింగంపల్లి సరోజినీ క్రికెట్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీలో ఏర్పాటు చేసిన ఖిసికింద్రాబాద్ జోన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ఖిను ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించి ప్రసంగించారు. నిరంతరం ప్రజల రక్షణ కోసం శ్రమించే పోలీసులు తమ ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. క్రీడలు కేవలం వినోదం కోసమే కాకుండా, సిబ్బంది మధ్య ఐక్యతను, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అదనపు డిసిపి నర్సయ్య మాట్లాడుతూ జోన్ పరిధిలోని వివిధ విభాగాల నుండి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని, గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో ఆడటం ముఖ్యమని తెలిపారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సరోజినీ క్రికెట్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీ మైదానం క్రీడాకారుల కోలాహలంతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి, చిలకలగూడ, గాంధీనగర్, ఉస్మానియా యూనివర్సిటీ, మహంకాళి డివిజన్ ఏసీపీలు ఎల్ రమేష్ కుమార్, కె.శేషాంక్ రెడ్డి, ఏ.యాదగిరి, ఎం.జగన్, పి.సుబ్బయ్య, చిక్కడపల్లి, ముషీరాబాద్, కాచిగూడ, చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ, గాంధీనగర్, దోమలగూడ, ఉస్మానియా యూనివర్సిటీ, నల్లకుండా, అంబర్ పెట్, మహంకాళి, రాంగోపాల్ పెట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్లు ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా 99 రోజుల 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక'

- రాజేంద్రనగర్ జెడ్సీ మంద మకరంద్

సమస్యలపై స్థానికులతో చర్చిస్తున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరంద్, డీసీ సురేందర్లు

చాంద్రాయణగుట్ట, మార్చి 5, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేసేందుకు సర్కిల్లో 99 రోజుల కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని జీహెచ్‌ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరంద్ అధికారులను ఆదేశించారు. గురువారం చాంద్రాయణగుట్ట సర్కిల్లోని హాఫీజ్ బాబానగర్, కంచన్‌బాగ్ తదితర ప్రాంతాలలో పర్యటించి స్థానిక ప్రజలతో ముచ్చటించారు. స్వచ్ఛ ఆటలలో ఇంటింటి నుండి చెత్త తరలింపు, బస్తీలలో, పాదాచారుల వంతెన, ప్రధాన రోడ్లు, ప్రభుత్వ భవనాల వద్ద పారిశుధ్యం తదితరాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జెడ్సీ మంద మకరంద్ మాట్లాడుతూ ప్రస్తుత పవిత్ర రంజాన్ మాసంలో ప్రార్థనా మందిరాల వద్ద, ప్రధాన రహదారులపై పారిశుధ్య సమస్య లేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ఈనెల 6వ తేదీ నుండి జూన్ 12 వరకు మూడు నెలల (99 రోజులు) పాటు జరిగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో జీహెచ్‌ఎంసి పరిధిలోని పారిశుధ్యం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, మలేరియా, యూసిడి, ఫుడ్ సేఫ్టీ, ఆస్తిపన్ను తదితర విభాగాలకు చెందిన అధికారులు బాధ్యతో విధులు నిర్వహించాలన్నారు. ఆస్తిపన్ను వసూలు విషయంలో మొండి బకాయిల వసూలుకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. డాకెట్ల వారిగా ఇచ్చిన టార్గెట్లకు అనుగుణంగా ఆస్తిపన్ను వసూలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫైళ్ళను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి.సురేందర్, ఎస్‌డబ్ల్యూఎం డిఇ ఎన్.బానుప్రతాప్, ఇంజనీరింగ్ డిఇ ప్రశాంత్, ఏఇలు, రాంకీ అధికారులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహ ఏర్పాటును ఆపండి..మీనాక్షీ నటరాజన్‌కు మూసీ జన్ ఆందోళన్ లేఖ

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త: మూసీ నది ఒడ్డున తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు విషయంలో జోక్యం చేసుకోవాలని ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్‌కు మూసీ జన్ ఆందోళన్ లేఖ రాసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ గ్రామంలో 10.34 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం సంకల్పించిందని దీని వల్ల మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్స్ నివాసులను ప్రభావితం చేస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా తెలంగాణ ప్రభుత్వం98.20 ఎకరాల రక్షణ శాఖ భూమిని బదిలీ చేయమని కోరడంతో పాటు. ఈ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ను గత నెల 12న స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారని ప్రజల వ్యతిరేకతను, ప్రజాస్వామ్య ప్రక్రియలను పట్టించుకోకుండా ఇలా చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు.ప్రతిపాదిత మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ లో భాగమైన "గాంధీ సరోవర్ ప్రాజెక్ట్" విషయంలో మేము తీవ్ర అభ్యంతరాలు, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నామని సివిల్ సొసైటీ కార్యకర్తలు, పర్యావరణవాదులు, మానవ హక్కుల సంస్థలు, స్థానిక నివాసితులతో కూడిన ఈ నెట్వర్క్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవాన్ని వెంటనే ఆపాలని, ప్రజాస్వామ్య చర్చల ద్వారా పూర్తి సమీక్ష చేయాలన్నారు. ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోవాలని మీనాక్షి నటరాజన్‌ను కోరారు. విగ్రహం ఏర్పాటును మహాత్మా గాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారని లేఖలో ప్రస్తావించారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుత రూపంలో కొనసాగితే మన సహజ వారసత్వానికి తిరిగి రాని నష్టం కలిగిస్తుందని గుర్తించాలన్నారు. స్థానిక ప్రజలలో ఉన్న ఈ అసంతృప్తిని రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ అధిష్టానానికి తెలియజేయాలని మీనాక్షిని కోరారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసిన ఈవో పెద్దిగారి శ్రీకాంత్

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును శాలువాతో సన్మానిస్తున్న నూతన ఈవో శ్రీకాంత్

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 5, ప్రభాతవార్త కూకట్‌పల్లిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి నూతన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన పెద్దిగారి శ్రీకాంత్ గురువారం కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావుని కలిశారు. ఈ సందర్భంగా దేవాలయ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవాలయ అభివృద్ధి నిర్వహణను మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు అవసరమైన సహకారం అందించాలని శ్రీకాంత్ కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ఆలయ నిర్వహణ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షి ంచారు.

గ్రేటర్‌లో కాంగ్రెస్‌జెండా ఎగురవేద్దాం : కూన మాణిక్యం గౌరీష్

కుత్బుల్లాపూర్ చెరుకుపల్లికాలనీ, రామకృష్ణానగర్ వాసులను కాంగ్రెస్ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ కార్పొరేటర్ కూన మాణిక్యం గౌరీష్

కుత్బుల్లాపూర్, మార్చి5 ప్రభాతవార్త రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లికాలనీ, రామకృష్ణానగర్, గాంధీనగర్ తదితర కాలనీలు,బస్తీలనుండి పెద్దఎత్తున సంక్షేమ సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్‌పార్టీలో చేరిన సందర్భంగా చింతల్ లోని పార్టీకార్యాలయంలో వారికి కాంగ్రెస్ కంఎదువను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా కూన మాణిక్యం గౌరీష్ మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్‌వైపే మొగ్గు చూపుతున్నారనడానికి కాంగ్రెస్ రాష్ట్రంలో గెలుపుపొందుతున్న విజయాలే కారణమన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌గౌడ్, కుత్బుల్లాపూర్ ఇంచార్జి కొలను హను మంతరెడ్డిల నాయకత్వంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కా ర్పొరేషన్‌లోని మూడు కార్పొరేషన్లలో ఎప్పుడు ఎన్నికలఉు నిర్వ హించినా కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈసం దర్భంగా కాంగ్రెస్ నాయకులు, చెరుకుపల్లి కాలనీ నాయకులు సురేందర్‌రెడ్డి,ఎస్‌సి అసోసియేషన్ చైర్మెన్ రామ్‌చందర్ పాల్గొ న్నారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీయువజన విభాగంనాయకులు కూన గిరిధర్‌గౌడ్ జన్మదిన వేడుకలను కేక్‌కట్‌చేసి ఘనంగా నిర్వహించారు.

వాటర్ ట్యాంకర్లపై చర్యలు తీసుకోండి : కొండల్‌రెడ్డి

అక్రమంగా నీటి దందా చేస్తున్న నీటి ట్యాంకర్లు

శేరిలింగంపల్లి,,మార్చి 5 ప్రభాతవార్త శేరిలింగంపల్లి నియోజక వర్గం లోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా బోర్లద్వారా నీటి ట్యాంకర్ల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయని, వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మదర్‌సేవా సమితి ఛైర్మన్, పాపిరెడ్డికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బద్దం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ..శేరిలింగంపల్లి మండలంలోని చందానగర్,మదీనాగూడ, కొండాపూర్, తదితర ప్రాంతాల్లో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమంగా బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తూ లక్షల రూపాయలను అర్జిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నీటి వ్యాపారం విచ్చలవిడిగా చేస్తుండటంతో చుట్టుపక్కల కాలనీల్లోని బోర్లు ఎండిపోయి వేలరూపాయలు వెచ్చించి నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన వాపోయారు. మద్యం మత్తులో కొందరు డ్రైవర్లు బోర్ నీటి ట్యాంకర్లను రాత్రి,పగలు తేడాలేకుండా హైస్పీడ్‌తో కాలనీల్లో పరుగులు పెట్టిస్తూ పలుమార్లు ప్రమాదాలకు గురై విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని,మృతుల కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ట్యాంకరులోని నీరు రోడ్లపై పడటంతో రోడ్లన్ని పాడైపోవడంతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రస్తుతం నడిచే వాటర్ ట్యాంకర్లు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతూ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నాయన్నారు. అక్రమ నీటి దందాలపై మండల రెవెన్యూ అధికారులు దృష్టిసారించాలని, అక్రమంగా నీటిని సరఫరా చేస్తు న్న వాటర్ ట్యాంకర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

అంబర్‌పేటలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ దిష్టిబొమ్మ దగ్ధం

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకురాలు శంభుల ఉషశ్రీకాంత్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ పూరి రాజీనామా చేయాలని మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబ,రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావుల ఆదేశాల మేరకు కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి రాజీనామా చేయాల్సిందిగా డిమాండ్ చేస్తూ బ్లాక్ జెండాలు పట్టుకొని, పీఎం మోడీ కాంప్రమైజ్ టీషర్టులను ధరించి, భారీ ఎత్తున మహిళలతో నినాదాలు చేస్తూ, ర్యాలీ తీశారు. అనంతరం హర్దీప్ సింగ్ పూరి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ మాట్లాడుతూ, భేటీ బచావో బేటి పడావో అని నినాదం చేస్తున్న మోడీ, జఫ్రీ ఎప్‌స్టీన్స్ ఫైల్స్‌లో కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి పేరు వచ్చినందుకు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.తీవ్ర సైకో అయిన, రేపిస్ట్ ఆడపిల్లల్ని కిడ్నాప్ చేసి వారిపై అత్యాచారం చేసిన రేపిస్ట్ మంత్రికి సంబంధాలు కలిగి ఉండడాన్ని ఖండించారు. ఇదేనా మోడీ బేటి పడావో బేటి బచావో అంటూ నిలదీశారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ చేస్తున్న ఈ సంఘర్షణకి మహిళా కాంగ్రెస్ తరపున మా ఈ పోరాటం కేంద్ర మంత్రి రాజీనామా చేసే వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బమ్మ ,జిల్లా సెక్రెటరీ శాంతమ్మ, కాంసెన్సీ ప్రెసిడెంట్లు కమల, మాధవి, బ్లాక్ ప్రెసిడెంట్‌లు ప్రసన్న భారతి, వనజ, అనిత, డివిజన్ ప్రెసిడెంట్లు శ్రీలత, రజని, అయేషా, ఫాతిమా, పద్మ, దుర్గ, సౌమ్య, దుర్గ, లావణ్య, లక్ష్మి, సంధ్యారాణి, ప్రియాంక, రమ్య తదితరులు పాల్గొన్నారు.

రసమయి ఆధ్వర్యంలో లలిత సంగీతానికి పట్టాభిషేకం

చిక్కడపల్లి మార్చి 5, ప్రభాతవార్త : రసమయి సంస్థ ఆధ్వర్యంలో ఖిలలిత సంగీతానికి పట్టాభిషేకంఖి అనే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో తొమ్మిదవ తేదీన జరిగే కార్యక్రమానికి హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ ము ఖ్య అతిథిగా హాజరవుతారని, ప్రముఖ కవి, లలిత గేయ కళా నిధి మరియు రసమయి అధ్యక్షులు డాక్టర్ ఎం .కె.రాము జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గాయని గాయకులను సత్కరిస్తారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగో పాల చారి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో అతిథిలుగా పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, ఆదాయపుపన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం. నరసింహప్ప తదితరులు పా ల్గొంటారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయకుడు కె. రామాచారి నిర్వహణలో డాక్టర్ ఎం.కె .రాము రచించిన లలిత గీతాల గానం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రముఖ గాయనీ గాయకులు కె.ఎస్.ఆర్. మూర్తి, శశికళాస్వామి, సురేఖా మూర్తి, విజయలక్ష్మి, హిమబిందు, వినోద్ బాబు, లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ సభ్యులు తమ గానంతో అలరించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎం.కె.ఆర్. ఆశాలత వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు.

స్పందించిన వాటర్‌వర్క్స్ అధికారులు

-రోడ్లపై పారుగుతున్న మురుగు నీటి సమస్యకు పరిష్కారం

(వార్త ప్రభావం)

గుండ్ల నర్సింహా స్వామి ఆలయం వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న వాటర్‌వర్క్స్ మేనేజర్ రామేశ్వరరావు,నాయకులు శ్రీహరి.

బేగంపేట మార్చి 5,ప్రభాతవార్త బేగంపేట ప్రకాశం నగర్ గుండ్ల నర్సింహస్వామి దేవాలయం గల్లీలో నెలన్నర రోజులుగా డ్రైనేజీ నీరు తీవ్ర దుర్వాసన వెదజల్లుతూ పొంగిపొర్లుతున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోకపోవడంపై ,,ప్రభాతవార్త,,హైదరాబాద్ మినీ లో మార్చి 4వ తేదీన రోడ్లంతా మురుగు పరుగు పేరుతో కథనం ప్రచురితమైంది .కథనం పై స్పందించిన బేగంపేట తాజా మాజీ కార్పోరేటర్ మహేశ్వరి నాయకులు శ్రీహరి అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఆ ప్రాంతాన్ని పరిశీలించా రు.పరిస్థితిని పరిశీలించిన వాటర్‌వర్క్స్ మేనేజర్ రామేశ్వరావు వెంటనే ఎయిర్‌టెక్ మిషిన్‌తో పాటు సిబ్బందిని రంగంలోకి దింపి వెంటనే డ్రైనేజీ నీరు బయటకు రాకుం డా చర్యలు చేపట్టారు.సమస్యను పరిష్కరించారు.ఈ సందర్భంగా అధికారులకు, తా జా మాజీ కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరిలకు స్థానిక బస్తీ వాసి బీఆర్ఎస్ నాయ కులు జాండ్ల కృష్ణ కృతజ్ఞతలు తెలియజేసారు.

మండుటెండలు!

ఎండలు తట్టుకోలేక చల్లదనం కోసం పరుగెడదామనుకుంటే... అవేమో ఎండమావులాయె... ఎలాగబ్బా... కూర్చుందామంటే ఎక్కడా చోటులేదాయె... ఇరుకు పరుగుల ప్రపంచంలో ప్రాణాలైనా నిలుపుకుందామంటూ హైదరాబాద్ నడిబొడ్డున లుంబిని పార్క్ వద్ద ఓ ముదసలి రహదారిపై పరుగులు పెడుతున్న దృశ్యం.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ **I, Kartik Jadhav** S/o Pandurang Jadhav R/o Shivaji Peth, Near Uppali Buruz, Doble Galli, Vijayapura Karnataka 586101 changed my name as **Kartik P Jadhav**

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం

సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్

కూకట్‌పల్లి సర్కిల్-52

లేఖ సం. 31/CMC/KPC-52/EE/2025-26, తేది: 04.03.2026

నిట్ సం. 31/CMC/KPC-52/EE/2025-26, తేది: 04.03.2026, పని పేరు: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం వద్ద అందుబాటులో ఉన్న స్క్రాప్ మెటీరియల్ అమ్మకం కొరకు ఇందుమూలముగా సీల్డ్ బిడ్స్ కోరబడుతున్నవి. ఆసక్తిగల బిడ్డర్లు CMC, కూకట్‌పల్లి జోన్, కూకట్‌పల్లి సర్కిల్-52, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం నుండి కార్యాలయ వేళలలో బిడ్ యొక్క వివరాలు, మరియు బేస్ ధరలు పొంది బిడ్‌ను షెడ్యూల్‌ను లేదా ముందు దాఖలు చేయవలెను. బిడ్స్ స్వీకరణలకు ప్రారంభ/చివరి తేదీ & సమయం: 05.03.2026 ఉ.11.30 గం. 07.03.2026 మ.3.00 గం. అధికారి పేరు, చిరునామా:- శ్రీమతి టి. రాజేశ్వరి, EE, CMC, కూకట్‌పల్లి సర్కిల్-52, KPZ, సెల్: 8897507674.

1) ఆసక్తిగల బిడ్డర్లు స్క్రాప్ మెటీరియల్‌కు బేసిక్ రేట్‌పై ఒక సింగిల్ పర్సంటేజ్ రేట్ కోట్ చేయవలసినదిగా కోరడమైనది. 2) ప్రత్యేక ఐటమ్‌లకు వేర్వేరు పర్సంటేజ్ అంగీకరించబడదు.

గమనిక:-

i) ఐటమ్ యొక్క పూర్తి వివరణకు ఏజెన్సీ క్రింది సంతకందారున్ని సంప్రదించవలసినదిగా కోరడమైనది.

ii) కోట్ చేసిన ఐటమ్ యొక్క పూర్తి ప్రత్యేక వివరణలతో సంస్థ/ఏజెన్సీ యొక్క లెటర్‌హెడ్ పైన CMC కూకట్‌పల్లి సర్కిల్-52, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయానికి 07.03.2026వ మ.3.00 గం. వద్ద లేదా ముందు సీల్డ్ బిడ్స్ దాఖలు చేయవలెను.

iii) కోటెడ్ రేట్‌పై GST అదనంగా ఉంటుంది.

iv) లెటర్ ప్యాడ్‌పై GST నం. తప్పక పేర్కొనవలెను.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-52, CMC

DIPR.No.16407-PP/CL/Advt/1/2025-26, తేది: 05.03.2026

IN THE COURT OF THE HON'BLE I ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B. NAGAR
I.A. No. 1405 of 2025
in
O.S. No. 176 of 1999

To,
Smt. M. Geetha W/o. M. Sanjeeva Reddy, R/o. Plot No.33, Lecturer's Colony, Hayathnagar, R.R. District
...Petitioner/Plaintiff
And
1). **Bokka Madhusudhan Reddy** (died per LR's)
2). **Smt. C. Jyothi** W/o. Veera Reddy, Aged: about 52 years, Occ: House wife, R/o. 1-5-78/A/2, Bhavani Nagar, Old Alwal, R.R.District.
3). **Bokka Jayamma** W/o. Bokka Madhusudhan Reddy, Age: 58 years, R/o. Flat No.206, Annapurna Residential Complex, 17-85, Road No.1, Kamala nagar, Beside Sreehitha Hospital, Chaitanyapuri, R.R. District.
4). **Bokka Sai Teja Reddy** S/o. Bokka Madhusudhan Reddy, Age: 33 years,
5). **B. Mani Deep Reddy** S/o. Bokka Madhusudhan Reddy, Age: 31 years, R4 & R5 Both R/o. H.No.6-99, Durga Nagar, Injapur Village, Abdullapurmet Mandal, R.R. District
...Respondents/Defendants

NOTICE

Take Notice that you are hereby informed that I was appointed as an Advocate Commissioner in I.A.No. 1405 of 2023 in O.S.No. 176 of 1999 as per the order dated 28/01/2026 in the matter of Smt. M. Geetha vs Bokka Madhusudhan Reddy & others on the file of the Hon'ble I Additional District and Sessions Judge, R.R. District at L.B. Nagar.
As per the Order dated 28/01/2026 by the Hon'ble I Additional District and Sessions Judge, R.R. District at L.B. Nagar, I was directed to make Partition of the below Schedule A & B Properties with metes and bounds and file report by 12/03/2026.

SCHEDULE OF "A" PROPERTY
All that the Agricultural lands bearing Sy.No.223 admeasuring Ac-2-31 gts, Sy No.226-Ac. 0-16 guntas, Sy.No. 228-0-17 guntas and Sy.No.230-0-19 guntas, totally admeasuring Ac. 4-03 guntas, situated at Injapur Village, Hayathnagar Mandal, Ranga Reddy District, and bounded by:- EAST: Lands of Bokka Narayana Reddy & Bokka Krishna Reddy, WEST: Lands of Bokka Nagi Reddy, NORTH: Lands of Bokka Nagi Reddy, SOUTH: 30 feet wide road

SCHEDULE OF "B"- PROPERTY
All that the Agricultural lands bearing Sy.No.238 admeasuring Ac-3-36 guntas., Sy. No.246/AA-Ac 2-33 guntas and Sy. No.247/AA-Ac. 1-31 guntas, totally admeasuring Ac. 8-20 guntas, situated at Turkayamjal Village, Hayathnagar Mandal, Ranga Reddy District, and bounded by:- EAST: Lands of Kosika Rangaiah, Pochaiah, B. Janga Reddy & Others, WEST: Lands of Maskat Ali, NORTH: Lands of B. Ramchandra Reddy & Jammidi Bali Reddy, SOUTH: Lands of B.Linga Reddy and Rami Reddy.
To comply the above said order, I fixed the day on 11/03/2026 at 11.45 a.m for the purpose of Demarcation/Division of above Schedule Properties.
Therefore you are hereby informed to be present and cooperate with the execution of commissioner warrant on 11/03/2026,11.45 a.m at the premises where the Schedule A & B properties are situated without fail so as to conclude the Demarcation/Division of above Schedule Properties with the support of the concerned officials.
Hence this Notice.
// BY ORDER OF THE HON'BLE COURT//
T. KAMALAKAR
Advocate
Flat No.107, V-2 Block, TNR Shakuntala Apartments, Shivapuri Colony, L.B. Nagar, Hyderabad-500 074
Mobile: 9440847399

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT COURTS COMPLEX AT L.B. NAGAR [illegible] ... SUMMONS [illegible] ... BY ORDER OF THE HON'BLE COURT [illegible] Advocates [illegible] COUNSEL FOR PLAINTIFFS

IN THE COURT OF THE HON'BLE ... SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT HYDERABAD O.S. No. [illegible] OF 2026 BETWEEN [illegible] ...Plaintiff AND [illegible] ...Defendants [illegible] BY ORDER OF THE COURT ANDE SHRAVAN KUMAR Advocate [illegible] Hyderabad, Telangana-500081.

IN THE COURT OF THE HON'BLE ... ADDL. DISTRICT JUDGE-CUM-... SPECIAL SESSIONS JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT KUSHAIGUDA [illegible] ...Petitioners [illegible] ...Respondents NOTICE [illegible] BY ORDER OF THE COURT [illegible] Advocate [illegible]

IN THE COURT OF THE HON'BLE I SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD S.O.P. No. [illegible] 2026 Between: [illegible] ...Petitioners AND [illegible] ...Respondents To, ALL CONCERNED Sir/Madam, Please take notice that the above S.O.P. No. [illegible] of 2026 was filed by the petitioners before the Hon'ble Court against the respondents and to declare the petitioners as successors and also issue a Succession Certificate [illegible] ... By order of the Court MR. SANTOSH KUMAR VADALI [illegible] Advocates [illegible] Telangana, Cell No. [illegible]

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

నేరేడ్ మెట్, మార్చి 5,ప్రభాతవార్త : సమాజానికి నిస్వార్థంగా సేవలందిస్తున్న జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులను సన్మానిస్తూ నేరేడ్మెట్ 188 డివిజన్‌లో సేవా కార్యక్రమం నిర్వహించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు జూలకంటి సాయి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు రోజూ శ్రమించే పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి నిజమైన సేవకులని పేర్కొన్నారు. వారి కృషి వల్లే ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవిస్తున్నారని అన్నారు. పండుగల సమయంలో కూడా తమ సేవలను ఆపకుండా కొనసాగిస్తున్న కార్మికులకు కృతజ్ఞతగా ఈ చిన్న కానుకను అందిస్తున్నామని తెలిపారు. పారిశుద్ధ కార్మికుల పట్ల గౌరవం చూపించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి సేవలను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు శంకర్రావు, శ్రీనివాస్, రవీందర్, నవీన్, రాజేష్ గౌడ్, రాజు, అవినాష్, శ్యాం ప్రసాద్, నవీన్, హరీష్, వినయ్ సాయి, రాజేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు అండగా ఉంటాం : ఎంపి ఈటల రాజేందర్

ఎంపీ ఈటలను కలిసిన కాప్రా ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం...

కుషాయిగూడ, మార్చ్ 5, ప్రభాతవార్త

నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రధాన పత్రికలు సీనియర్ జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు గురువారం మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రధాన పత్రికల ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన సంపూర్ణ తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జ్యోతిర్మయ చారి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్, ఉపాధ్యక్షులు పలుగుల పవన్, లక్కిడి బాల్రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి గడ్డమీద బాలరాజు గౌడ్, సీనియర్ జర్నలిస్టులు కేసి మోహన్, క్యాసాని సత్యనారాయణ, సహదేవా చారి, వేముల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పదవతరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత

తుర్కయంజాల్ 5.ప్రభాతవార్త

ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్, రాగన్న గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తొర్రూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో, రైటింగ్ ప్యాడ్స్ పెన్నులు పరీక్ష రాసే సామాగ్రిని అందజేసి విద్యార్థులకు విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని నింపారు. వారు మాట్లాడుతూ,పదవ తరగతి విద్యార్థుల జీవితంలో కీలక మైన దశ అని క్రమ శిక్షణతో చదువుకొని పాఠశాలకు, తల్లిదం డ్రులకు మంచి పేరు తేవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, టీమ్ ఏఎన్ఆర్ సభ్యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

నాలా పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలి : బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

నాలా పనులను పరిశీలిస్తున్న మహేశ్వర్ రెడ్డి

హుడాకాంప్లెక్స్ మార్చి5 , ప్రభాతవార్త :

గడ్డి అన్నారం డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో జరుగుతున్న నాలా పనులను గురువారం బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. నాలా పనులకు విద్యుత్ వైర్లు, డ్రైనేజీ పైపులైన్‌లు ఉండడంతో అధికారుల మధ్య సమన్వయలోపంతో పనులు అలస్యంగా జరుగుతున్నాయని కాలనీ వాసులు అయన దృష్టికి తీసుకొని రావడంతో జిహెచ్ఎంసి, జలమండలి, విద్యుత్ అధికారులతో కలిసి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ నాలా వద్ద ఉన్న డ్రైనేజీ పైపులైన్, విద్యుత్ వైర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి నాలా పనులను త్వరితగతిన ప్రారంభించాలని సంబంధిత అధికారులను కోరారు. అంతేకాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డీఈ విజయ్,వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్,జలమండలి మేనేజర్ రజిత, సూపర్వైజర్ ప్రశాంత్, విద్యుత్ ఏఈ ప్రీతీ, కాలనీ అధ్యక్షుడు తులసీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరసిహారావు, మాజీ కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజెఆర్‌నగర్‌లో పవర్ బోర్ వెల్ మరమ్మతులు చేయించిన మాజీ కార్పొరేటర్



మల్కాజిగిరి మార్చి 5,ప్రభాతవార్త : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బి జె ఆర్ నగర్ స్లామ్ ఏరియాలో గత కొంత కాలంగా పవర్ బోర్ పాడై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మాజీ కార్పొరేటర్ పై ప్రేమ్ కుమార్ దృష్టికి తీసుకురావడం జరిగింది వెంటనే స్పందించి జలమండలి అధికారుల తో మాట్లాడి పవర్ బోర్ మరమ్మతులు చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో బాబు,బస్తీ వాసులు హజ్మత్ అలీ, లగాన్, షాధుల్, ఖలీల్, అఖిల్, మణెమ్మ, రేఖా, షహీదా బేగం,లక్ష్మమ్మ,జయలక్ష్మి, కమల,నాగమణి, తదితరులు పాల్గొన్నారు

డిఫెన్స్ కాలనీ సొసైటీలో అవకతవకలు బహిర్గతం

-ప్లాట్ల కేటాయింపుల్లో గందరగోళం

-రూ.13 కోట్ల నష్టం ఆరోపణలు

నేరేడ్‌మెట్, మార్చి 5,,ప్రభాతవార్త : నేరేడ్‌మెట్‌లోని డిఫెన్స్ కాలనీ సొసైటీలో భారీ అవకతవకలు జరిగాయని ఉపసభ్యుడు సహా పలువురు మాజీ సైనికులు తీవ్ర ఆరోపణలు చేశారు. సొసైటీ వ్యవహారాల్లో నియమ నిబంధనలు పక్కనబెట్టి అక్రమాలు కొనసాగుతున్నాయని, దీనివల్ల సొసైటీకి సుమారు రూ.13 కోట్ల నష్టం జరిగినట్లు వారు పేర్కొన్నారు. సొసైటీ వ్యవహారాలపై జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఇప్పటికే నోటీసులు జారీ చేసి కొన్ని ఆదేశాలు ఇచ్చినప్పటికీ వాటిని నిర్వాహకులు పట్టించుకోవడం లేదని సభ్యులు తెలిపారు. డీసీఓ నోటీసులో ఐ. రాజారావు అర్హత లేని సభ్యుడిగా పేర్కొనడంతో పాటు, డి. నాగేశ్వరరావును సెక్షన్-52 విచారణ పూర్తయ్యే వరకు పదవి నుంచి తప్పించాలని సూచించినట్లు చెప్పారు. అయినప్పటికీ అధ్యక్షుడు, కార్యదర్శి కలిసి యూనియన్ బ్యాంక్ ఖాతా నుంచి సుమారు రూ.2 లక్షలు అనధికారికంగా ఉపసంహరించుకున్నారని ఆరోపించారు. కమ్యూనిటీ హాల్ అద్దెల పేరుతో కూడా డబ్బులు అక్రమంగా వసూలు చేస్తున్నారని, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఖాతాలను ఇప్పటివరకు ఆడిట్ చేయలేదని తెలిపారు. నగదు లెడ్జర్లు కూడా నాగేశ్వరరావు వద్దనే ఉంచినట్లు పేర్కొన్నారు. డీసీఓ ఆదేశాల అనంతరం కూడా ఐ. రాజారావు సంతకంతో సర్క్యులర్లు జారీ చేసి సాధారణ సభ (జీబీఎం) సమావేశం నిర్వహించడం చట్ట విరుద్ధమని సభ్యులు పేర్కొన్నారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు కూడా చెల్లవని వారు స్పష్టం చేశారు. అలాగే వై. శుభకృష్ణ రావు, నిర్మల నిరంజని రాజీనామాలను ఆమోదించామని అధ్యక్షుడు, కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసి వారి ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు ప్రకటించడం కూడా చట్టబద్ధం కాదని ఆరోపించారు. సొసైటీ ప్రయోజనాల కోసం ప్రశ్నిస్తున్న మాజీ సైనికులకు సభ్యత్వం ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, అర్హత గల మాజీ సైనికులకు వెంటనే సభ్యత్వం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇదే సమయంలో డి. నాగేశ్వరరావు సభ్యత్వంపై కూడా చట్టపరమైన వివాదం కొనసాగుతున్నట్లు తెలిపారు. సొసైటీకి చెందని వ్యక్తులకు ప్లాట్లు కేటాయించడం వల్ల సొసైటీకి సుమారు రూ.13 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై వ్యవసాయ-సహకార శాఖ ప్రధాన కార్యదర్శి జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

విశ్వానికి వెలుగు నారీమణి : పివిపి అంజనీ కుమారి

పివిపి అంజనీ కుమారీని సన్మానిస్తున్న నిర్వాహకులు తదితరులు

మలక్ పేట ,మార్చి 5, ప్రభాతవార్త: విశ్వానికి వెలుగు నారీమణి అని తెలంగాణ రాష్ట్ర సిఎస్సి కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పివిపి అంజనీ కుమారి పేర్కొన్నారు. తెలంగాణ భాష సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విశ్వసాహితీ కళావేదిక హైదరాబాద్ వారి సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలను అత్యంత వైభవోపేతంగా నజరిగాయి. ఈ కార్యక్రమములను నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సిఎస్సి కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పివిపి అంజనీ కుమారి మాట్లాడుతూ నాటి కృతయుగం నుండి నేటి కలియుగం వరకు సమాజ నిర్మాణంలో స్త్రీ మూర్తులు పోషించిన పాత్ర అద్వితీయమని అన్నారు. నేడు ఎందరో మహిళలు రాష్ట్రపతులుగా, ముఖ్య మంత్రులుగా, కేంద్ర మంత్రులుగా, రాష్ట్ర మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ప్రొఫెసర్లుగా సైంటిస్టులుగా, ఫిలాసఫర్లుగా రాణిస్తూ మగవారి కంటే కూడా సమాజానికి గొప్ప సేవలను అందిస్తున్నారిని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరము ప్రభుత్వము నిర్వహించే పదవ తరగతి, ఇంటర్, ఎంసెట్, నీట్, సివిల్ సర్వీస్, గ్రూప్ 1, గ్రూప్ 2, లాంటి పోటీ పరీక్షలలో అమ్మాయిలే అగ్రస్థానం లో దూసుకుపోతున్నారని తెలిపారు. నేడు కూడా మహిళా మణి ద్రౌపది ముర్ము భారతదేశానికి రాష్ట్రపతిగా పరిపాలిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కలాం విజన్ యువతేజం ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కరీముల్లా,నారాయణస్వామి, గజల్ శ్రీనివాస్, ప్రముఖ జానపద గాయకుడు, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు దరువు అంజయ్య, పసునూరి శ్రీనివాసులు, కొల్లి రమావతి, సహాయ పోలీస్ కమిషనర్ డాక్టర్ కిరణ్ కుమార్, తెలుగు, తమిళ హీరో రామకృష్ణ చంద్రమోళి, ప్రముఖ సాహితీవేత్త వేమూరి రాధా రాణి, మనోహర్ రెడ్డి ప్రముఖ కవి సాహితీవేత్త బడే సాబ్, కేశరాజు వెంకట ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కవి సమ్మేళనం లో పాల్గొన్న కవులకు, కవయిత్రులకు జ్ఞాపికలతో సన్మాన పత్రాలతో సన్మానించడం తో పాటు కార్యక్రమానికి విచ్చేసిన గౌరవ, విశిష్ట ,ప్రముఖ, ముఖ్య అతిథులకు ఘనంగా సన్మానించారు.

అపార్ట్‌మెంట్‌కు ఫ్రీ మంజీరా.. పేద ఇళ్లకు బిల్లుల భారమా?

-వాటర్ వర్క్స్ అధికారుల తీరుపై నేరేడ్‌మెట్‌లో ఆగ్రహం

నేరేడ్‌మెట్, మార్చి 5,ప్రభాతవార్త : నేరేడ్‌మెట్ చౌరస్తా సమీపంలోని శ్రీ కాలనీలో మంజీరా నీటి కనెక్షన్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. కేవలం 40-50 గజాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న నిరుపేదలకు మాత్రం వాటర్ బిల్లులు విధిస్తూ, బకాయిల పేరుతో నల్లా కనెక్షన్లు కట్ చేసి వసూలు చేస్తుండగా, అపార్ట్మెంట్లకు మాత్రం ఉచితంగా మంజీరా నీటి కనెక్షన్ ఇవ్వడం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. చౌరస్తాకు సమీపంలోని ప్రధాన రహదారిపై జీ+3 అంతస్తులతో నిర్మించిన సాయి కార్తిక్ అపార్ట్మెంట్‌లో 13 ఫ్లాట్లు ఉన్నప్పటికీ, ఆ అపార్ట్మెంట్‌కు ఉచితంగా మంజీరా నీటి కనెక్షన్ కల్పించడంపై స్థానికుల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు స్వతంత్ర ఇళ్లకు మాత్రం బిల్లుల పేరుతో ఒత్తిడి తెచ్చి వసూళ్లు కొనసాగిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై వాటర్ వర్క్స్ అధికారులను పలుమార్లు ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం రాలేదని శ్రీ కాలనీ నివాసి విజయకుమార్ రెడ్డి తెలిపారు. వేసవికాలం సమీపిస్తున్న వేళ ఇప్పటికే మంచినీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో పేద ఇళ్లపై బిల్లుల భారాన్ని మోపడం అన్యాయమని అన్నారు. నిరుపేదలకు ఉచితంగా మంజీరా నీటిని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉండగా, అపార్ట్మెంట్లకు మాత్రం ఫ్రీ కనెక్షన్లు ఇవ్వడం వెనుక ఏదైనా అంతర్గత ఒప్పందాల్లు ఉన్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే దర్యాప్తు జరిపి నిజానిజాలు బయటపెట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎఆర్‌సిఐ భూనిర్వాసిత బాలాపూర్ దళిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి

కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ బాలాపూర్ ఎఆర్‌సిఐ గేటు ముందు భూనిర్వాసిత కుటుంబాలతో కలిసి ధర్నా చేస్తున్న అఖిల పక్ష నేతలు చిగిరింత నర్సింహారెడ్డి, కొలను శంకర్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త: కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ ఎఆర్‌సిఐ ఏర్పాటు సందర్భంగా భూములు కోల్పోయిన దళిత రైతు కుటుంబాలకు న్యాయం చేసి ఉద్యోగాలు కల్పించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, బిజెపి సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలను శంకర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత వంగేటి లక్ష్మారెడ్డిలు డిమాండ్ చేశారు. బాలాపూర్ మండలంలోని బాలాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఆర్‌సిఐ రోడ్డు పక్కన గ్రామ రైతులు సాగు చేసుకుంటున్న సర్వే నెంబర్ 74లోని 95 ఎకరాల భూమిని 1990వ సంవత్సరంలో కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ ఎఆర్‌సిఐ ఏర్పాటు నిమిత్తం అప్పటి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జరిగింది. అయితే 95 కుటుంబాలకు ఎఆర్‌సిఐలో ఉద్యోగాలు కల్పిస్తామనీ జిఓ జారీ చేసి కేవలం 10 మందికి మాత్రమే పర్మినెంట్ ఉద్యోగాలు ఇచ్చి 30 మందిని ఔట్ సోర్సింగ్ (స్వీపర్) ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. అయితే దాదాపు 36 సంవత్సరాలు అవుతున్నా ఎఆర్‌సిఐ యాజమాన్యం కాలయాపన చేస్తూ నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయకపోవడంతో గురువారం భూములు కోల్పోయిన నిస్సహాయుల కమిటీ ఆధ్వర్యంలో ఎఆర్‌సిఐ ఎదుటు ధర్నా నిర్వహించారు. కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, జొన్నాడు జంగయ్య, నీరుడు శ్రీరాములు, తిమ్మని గిరీష్, బొర్ర రవికుమార్, జొన్నాడు రాకేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి నర్సింహారెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలతో పాటు పలువురు సంఘీభావం తెలిపారు. ఇందులో భాగంగా వారు భూనిర్వాసిత కుటుంబాలతో పాటు ధర్నాలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలు దాటినా ఇంకా ఉద్యోగాలు ఇవ్వకుండా ఇంకా జాప్యం చేయడం ఎఆర్‌సిఐ యాజమాన్యానికి తగదని అన్నారు. మిగిలిన భూ నిర్వాసిత దళిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చే వరకు వారికి అండగా ఉండి వారితో పాటు పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండోజు రఘునందనాచారి, మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ వైస్ ఛైర్మన్ కొలను తిరుపతిరెడ్డి, మాజీ డైరెక్టర్ చిగిరింత శ్రీరాంరెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఎర్ర జైహింద్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, జోరల ప్రభాకర్, దొడ్డి శ్రీశైలం, టేకుల శశిధర్‌రెడ్డి, అరవింద్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, బోయిని ఎల్లయ్య, ఉమేష్, శ్రీధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రసన్నాంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు

వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ రమేష్‌నేత

ఎల్.బి.నగర్,మార్చి 5 ప్రభాతవార్త: శ్రీరామకృష్ణపురంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ తలాటి రమేష్‌నేత తెలిపారు. దేవాలయం ఆవరణలో గురువారం బ్రహ్మోత్సవాల పత్రికను ఆవిష్కరించి బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు. ఈనెల 6వ తేదీ శుక్రవారం నుంచి 10వ తేదీ మంగళవారం వరకు 5 రోజుల పాటు దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో దేవాలయం ఈవో కే.ఉమా రాణి, డైరెక్టర్లు బి.మహేందర్, ఎస్.దుర్గాప్రసాద్, ఏ.సాయి కుమార్, కె.శ్యాంసుందర్రావు, మంచుకొండ శ్రీనివాసగుప్తా, ఎం.శ్రీమన్నారాయణ, విజయలక్ష్మి సుబ్రహ్మణ్యం, వై.అన్నపూర్ణ, జగిని ఉమామహేశ్వరి, మారం సుజాత, బి.వెంకటేశ్వర్లు పి.శ్రీనివాస్‌గుప్తా, అర్చకులు డి.లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు తన వంతు సహకారం : ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి.తిరుపతిరెడ్డి

ఉప్పల్, మార్చి 5 ప్రభాతవార్త : ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రామ్‌రెడ్డి, అసెంబ్లీ అధ్యక్షుడు పల్లా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డిని గురువారం కలిశారు. రెండవసారి ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మీడియా అకాడమీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీలు కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డిలతో కూడిన మెమెంటోను ఆయనకు అందజేశారు.

మల్కాజ్‌గిరిలో వికసిత్ భారత్ యువ పార్లమెంట్‌కు ఏర్పాట్లు

నేరేడ్ మెట్ , మార్చి 5,ప్రభాతవార్త : వికసిత్ భారత్-2047 లక్ష్యంతో యువతను దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో మల్కాజ్‌గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వికసిత్ భారత్ యువ పార్లమెంట్-2026 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమం మార్చి 7న సైనిక్‌పురిలోని భవన్ వివేకానంద డిగ్రీ కళాశాలలో జరగనుంది. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, రిజిస్ట్రేషన్లు ఉదయం 8:15 గంటల నుంచి చేపడతామని నిర్వాహకులు తెలిపారు. 50 ఏళ్ల అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) భారత ప్రజాస్వామ్య పాఠాలు" అనే అంశంపై యువత మధ్య చర్చలు నిర్వహించనున్నారు. పార్లమెంటరీ విధానాలపై అవగాహన పెంపొందించడంతో పాటు జాతీయ అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరచుకునే వేదికగా ఈ కార్యక్రమం నిలవనుందని తెలిపారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి ఎంపికైన 10 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు చర్చలో పాల్గొననున్నారు. నవ భారత నిర్మాణంలో యువత చురుకుగా పాల్గొనాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డా. బండి రాజు, వైస్ ప్రిన్సిపల్ డా. అడవి రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. జగన్, డా. హరిత, డా. ప్రదీప్ సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు.

హిందూ సమ్మేళన బ్రోచర్ ఆవిష్కరణ

హిందూ సమ్మేళన బ్రోచర ఆవిష్కరిస్తున్న దివ్యశ్రీ రమణచక్రవర్తుల

ఎల్.బి.నగర్,మార్చి 5 ప్రభాతవార్త: హయత్‌నగర్‌లోని లక్ష్మారెడ్డి పాలెం సూర్యవంశీ గార్డెన్ సిటీ కమ్యూనిటీహాల్ వద్ద శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి, శ్రీ దుర్గానందపురి స్వామీజీ(మాత అన్నపూర్ణేశ్వరి కాశీ విశ్వనాథ పీఠం) పర్యవేక్షణలో ఈనెల 15వ తేదీ ఆదివారం జరగనున్న శ్రీ శ్రీనివాస కళ్యాణం నిర్వాహకులు శ్రీలక్ష్మీనారాయణ సేవా సమితి వ్యవస్థాపకులు శ్రీలక్ష్మీనారాయణ ఉపాసకులు, గురుమాతా దివ్యశ్రీ రమణ చక్రవర్తుల చేతుల మీదుగా గురువారం బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు దివ్యశ్రీ రమణ చక్రవర్తుల మాట్లాడుతూ ఆదివారం జరిగే శ్రీశ్రీనివాస కళ్యాణం మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి భక్తులు వేలాదిగా రావాలని కోరారు. శ్రీనివాస కళ్యాణం మహోత్సవంలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మీనారాయణ సేవా సమితి డైరెక్టర్ శ్రీచక్రవర్తుల రమణాచారి, హిందూ సమ్మేళన ఉత్సవ సమితి అధ్యక్షులు బాగన్నగారి గోవిందరెడ్డి, ప్రధానకార్యదర్శి పాదూరి క్రాంతి కుమార్‌రెడ్డి, కోశాధికారి దైద శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డిపాలెం కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేయూత : మంత్రి శ్రీధర్‌బాబు

విద్యార్థులకు చెక్‌లు అందజేస్తున్న రామంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 5 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేయూత అందించడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్‌కు చెందిన ఎనిమిది మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు పీజులను చెక్‌లను రూపంలో చెల్లించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బిఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు చెక్కులు అందజేయడం అభినందనీయం అన్నారు. పతి ఏటా అనేక మంది విద్యార్థులకు విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే బిఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య విద్య అభ్యసించే విద్యార్థులకు ఫీజుల భారం కలగకుండా చూస్తామని, భవిష్యత్తులో గొప్ప వైద్య లుగా మారి సమాజానికి సేవ చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, కాప్రా డివిజన్ అధ్యక్షుడు భైరి నవీన్ గౌడ్, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బిజెపి పోరుబాట : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



రామంతాపూర్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

రామంతాపూర్, మార్చి 5 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యలపై పోరుబాటు తప్పదని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్ నెహ్రూనగర్‌లో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జనార్ద న్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, పలువురు పార్టీ నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్‌లో ప్రజా సమస్యలు పట్టించుకునే నాథుడే లేదని, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ ఒక్క హామీ కూడా పరిష్కరించడం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమిలేదన్నారు. ఉప్పల్ సర్కిల్‌లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఇతర మౌళిక సదుపాయా లు సక్రమంగా లేవని అన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, బిఆ ర్ఎస్ పార్టీలను కూడా నమ్మే ప్రసక్తి లేదన్నారు. బిజెపి చా లా బాధ్యతయుతమైన పార్టీ ప్రజల అవసరాలను తీర్చే పార్టీ అన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మశానవాటికల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న పసునూరి బిక్షపతిచారి, కీసర గోవర్ధన్‌రెడ్డి: చిత్రంలో పెండ్యాల నర్సింహా, కోడూరు సోమేశ్వర్, ముత్తంగి కరుణానిధి తదితరులు

సరూర్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడ, మీర్‌పేట్‌లలోనున్న స్మశానవాటికల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని చేవెళ్ళ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని స్థానిక మీర్‌పేట్ పాత కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచారి, పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డిలు కోరారు. ఈ మేరకు వారు స్థానిక బిజెపి సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లతో ఎంపిని కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీర్‌పేట్ సిర్లాహిల్స్, లెనిన్‌నగర్, జిల్లెలగూడ సాయినగర్‌లలోనున్న స్మశానవాటికల్లో స్నానాల గదులు, ఇతర సదుపాయాలు లేకపోవడంతో ఇక్కడికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ఆయా స్మశానవాటికల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి చేపట్టే పనుల కోసం రూ.5.60 లక్షలు ఖర్చు అవుతాయని అధికారులు ప్రతిపాదనలు చేశారని వారు వెల్లడించారు. ఈ మేరకు అవసరమయ్యే నిధులు కేటాయించి స్మశానవాటికల అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహా, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కోడూరు సోమేశ్వర్, మాజీ కార్పొరేటర్లు ముత్తంగి కరుణానిధి, కీసర హరినాథ్‌రెడ్డి, కీసర జమునా కృష్ణారెడ్డి, భీమ్‌రాజ్, నాయకులు ఆర్.యాదగిరి యాదవ్, బెల్లంకొండ నాగరాజు, శ్యాంసుందర్, ఆవుల సత్తయ్య, చిల్లంపల్లి రాజశేఖర్, నాగేశ్, మల్లికార్జున్, విక్కీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా నిధి కుంభం ప్రతిష్టాపన

వాసవి మాత ఆలయ నిధి కుంభం ప్రతిష్టాపనలో పాల్గొన్న యిరువెంటి సురేష్‌గుప్త, పచ్చిపులుసు శ్రీరామచంద్రమూర్తి గుప్త, తెరటిపల్లి శ్రీనివాస్‌గుప్త, గందె వెంకటేశ్వర్లు గుప్త తదితరులు

సరూర్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని జిల్లెలగూడ ధాతునగర్ క్రాస్ రోడ్స్‌లోనున్న నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి క్యాంపు ఆఫీస్‌కు పక్కనే నిర్మాణంలో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో గురువారం నిధి కుంభం ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో కోట్లాది రూపాయలతో రాతి శిలలతో అద్భుతంగా నిర్మిస్తున్న ఈ భవ్యమైన వాసవి మాత ఆలయంలో శాస్త్రోక్తంగా నిధి కుంభం ప్రతిష్టాపన జరిపారు. ఈ సందర్భంగా శృంగేరీ పీఠానికి చెందిన ఫణి శశాంక శర్మ, గోపికృష్ణల వేద మంత్రోచ్చారణల మధ్య నిర్మాణ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య కుటుంబాల సమక్షంలో భక్తి శ్రద్ధలతో నిధి కుంభం ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఛైర్మన్ తెరటిపల్లి శ్రీనివాస్‌గుప్త, అధ్యక్షుడు పచ్చిపులుసు శ్రీరామచంద్రమూర్తి గుప్త, ప్రధాన కార్యదర్శి యిరువెంటి సురేష్‌గుప్త, కోశాధికారి గందే వెంకటేశ్వర్లు గుప్త, పలువురు మేనేజింగ్ ట్రస్ట్ సభ్యులు, డైరెక్టర్లు, దాతలు, ఆర్యవైశ్య కుటుంబాల వారు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్ పేరుతో వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న ట్రాఫిక్ పోలీసులు : విజయసింహారెడ్డి

సర్వీస్ రోడ్లో పార్కింగ్ ఏరియా ప్రాంతాన్ని చూపిస్తున్న మందడి విజయసింహారెడ్డి తదితరులు.

మలక్ పేట, మార్చ్ 5, ప్రభాతవార్త: అక్రమ పార్కింగ్ పేరుతో మలక్ పేట ట్రాఫిక్ పోలీసులు వాహన దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానిక నాయకులు మందడి విజయసింహారెడ్డి పేర్కొన్నారు. మూసారంబాగ్ లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వీస్ రోడ్లో మూసారంబాగ్ చౌరస్తా నుంచి యాక్సిస్ బ్యాంకు వరకు ట్రాఫిక్ పోలీసులు కేటాయించిన పార్కింగ్ స్థలంలోనే వాహనాలను పార్కు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే మలక్ పేట ట్రాఫిక్ ఎస్ఐ రాము ఉద్దేశపూర్వకంగా క్రెన్ ద్వారా వాహనాలను తీసుకెళ్లి చాలాన్లను విధిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు సూచించిన ఏరియాలోనే పార్కింగ్ చేస్తున్న వాహనదారులను ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇదే ఏరియాలో జిహెచ్ఎంసి పెయిడ్ పార్కింగ్ ఉండగా, దీనిపై ప్రజలు అధికారులపై ఒత్తిడి తేవడంతో దాన్ని తొలగించడం జరిగిందని వివరించారు. పార్కింగ్ చేసుకోవడానికి రోడ్డు సవ్యంగా లేని కారణం గా సిమెంట్ కాంక్రీట్ తో రోడ్డు లెవెల్ చేయగా, దీనిపై కేసు పెడతామంటూ ఎస్సై రాము దుకాణం దారులను బెదిరించ డం సమంజసం కాదని పేర్కొన్నారు. ఎస్సై రాము తన తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దుకాణదారులు, వాహనదారులు పాల్గొన్నారు.

ఎంపి అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డికి ఎంపీఆర్ సత్కారం



ఎంపి అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 5 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డిని గురువారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వేం నరేందర్‌రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గం సమస్యల పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ తగు గుర్తింపు ఇచ్చిందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్‌లు పరమేశ్వర్ రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సరెడ్డి భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.